# తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | శుక్రవారం-29- ఆగస్టు - 2025 | సంపుటి : 3 | సంచిక : 93 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in








# కామారెడ్డిలో వరద బీభత్సం



- అతలాకుతలమైన జనజీవనం
- ఇళ్లలోకి భారీగా చేరుతున్న నీరు
- దీంతో వేరే చోట తలదాచుకుంటున్న బాధితులు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

బుధవారం, గురువారం కుండపోతగా కురిసిన వర్షానికి కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలు అతలాకుతలమయ్యాయి. రికార్డు స్థాయి వర్షాలతో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. ఆకాశానికి చిల్లులు పడ్డాయా అన్నట్లుగా కురిసిన వానలతో వాగులు, వంకలు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. పోటెత్తిన వరద ప్రవాహానికి, పలు చోట్ల చెరువులు, రోడ్లు తెగిపోయాయి. రహదారులు తెగిపోయి రాకపోకలు నిలిచిపోయాయి. లోతట్టు ప్రాంతాలను వరద చుట్టుముట్టడంతో ఇళ్లు జలమయ్యాయి. కామారెడ్డి జిల్లాలో దంచికొట్టిన వానలతో జనజీవనం అస్తవ్యస్తమైంది. బుధవారం ఒక్కరోజే కామారెడ్డి జిల్లాలోని రాజంపేటలో 44 సెంటి మీటర్ల వర్షం కురవగా గురువారం ఉదయం

మిగతా 2లో

## మహా గణపతి దర్శనం కోసం తరలివస్తున్న లక్షలాది భక్తులు


**24 గంటల్లో ఏకంగా 4 లక్షల మంది భక్తులు ఖైరతాబాద్ మహా గణపతిని దర్శించుకున్నారు**

ఖైరతాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

ఖైరతాబాద్ మహా గణపతిని దర్శించుకోవడానికి భక్తులు తండోపతండాలుగా తరలివస్తున్నారు. కేవలం హైదరాబాద్‌లోని వాళ్లు మాత్రమే కాకుండా.. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి కూడా పెద్ద ఎత్తున జనం మహా గణపతి దర్శనం కోసం వస్తున్నారు. రెండో రోజు కూడా భక్తుల రద్దీ కొనసాగుతోంది. 24 గంటల్లో ఏకంగా 4 లక్షల మంది భక్తులు ఖైరతాబాద్ మహా గణపతిని దర్శించుకున్నారు. గణనాథుని ప్రాంగణంలో యువతీ,యువకులు సెల్ఫీలు తీసుకుంటూ మురిసిపోతున్నారు.

మిగతా 2లో





## వరద ప్రభావిత ప్రాంతాల్లో ముఖ్యమంత్రి ఏరియల్ సర్వే

- ఏరియల్ వ్యూ ద్వారా గోదావరి, ఎల్లంపల్లి ప్రాజెక్ట్ పరిశీలన
- కాళేశ్వరంపై జస్టిస్ పీసీ ఘోష్ ఇచ్చిన నివేదికపై అసెంబ్లీలో చర్చిస్తాం
- మామ, అల్లుడు ఎన్ని కుట్రలు చేసిన పాపాలు పోవు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

2లో

## స్థానిక సంస్థల ఓటర్ల జాబితా సవరణను వాయిదా వేయాలి

- రాష్ట్ర ఎన్నికల సంఘానికి కేటీఆర్ లేఖ
- వర్షా లు, వరదల దృష్ట్యా ఓటర్ల జాబితా సవరణ వాయిదా వేయాలి
- వరద పరిస్థితుల్లో ప్రజలు ఓటరు జాబితాలను చూడలేరు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2లో



## ఇలాంటి వర్షం ఎన్నడూ పడలేదు

- లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- హరీశ్ రావు

హైదరాబాద్ (తెలంగాణ ముచ్చట్లు)

మెదక్, సిద్దిపేట జిల్లాల వాసులను భారీ వర్షాలు, వరదలు అతలాకుతలం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు నేతృత్వంలోని బీఆర్ఎస్ బృందం వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తోంది. ఎమ్మెల్యే హరీశ్ రావు టీం ముందుగా

మిగతా 2లో



## తెలంగాణ బీఎస్పీ చీఫ్‌గా ఇబ్రాం శేఖర్


- బీఎస్పీ తెలంగాణ అధ్యక్షుడిగా ఇబ్రాం శేఖర్ నియామకం
- ముందు వరుసలోనే విజయాన్ని సాధించిన శేఖర్
- రాజకీయ ప్రయాణంలో శేఖర్ విజయాలు
- డిప్యూటీ మేయర్ పదవి దక్కించుకున్న చాకచక్యం
- బహుజనుల పురోగతే బీఎస్పీ ధ్యేయం
- మాయావతి మార్గనిర్దేశకత్వం అవసరమని శేఖర్ వ్యాఖ్యలు

హైదరాబాద్ :

తెలంగాణ బహుజన్ సమాజ్ పార్టీకి నూతన రథసారధి వచ్చారు. పార్టీ జనరల్ సెక్రెటరీతో పాటు బడంగ్‌పేట మున్సిపాలిటీకి డిప్యూటీ మేయర్‌గా పని చేసిన ఇబ్రాం శేఖర్‌ను అధ్యక్షుడిగా ఆ పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి నియమించారు. బుధవారం లక్నోలో జరిగిన సమావేశంలో ఈ ప్రకటనను అధికారికంగా వెల్లడిరచారు. కొద్ది రోజుల క్రితం రాష్ట్ర అధ్యక్ష పదవికి మంద ప్రభాకర్ రాజీనామా చేశారు.

మిగతా 2లో





## ప్రాణం మీదకు తెచ్చిన పందెం

సూర్యాపేట: గత వారం రోజుల నుంచి రెండు తెలుగు రాష్ట్రాల్లో వర్షా లు దంచి కొడుతున్నాయి. తెలంగాణ రాష్ట్రంలోని కామారెడ్డి, మెదక్, నిజామాబాద్, పెద్దపల్లి, సిద్ధిపేట జిల్లాల్లో వర్షా లు బీభత్సం సృష్టిస్తున్నాయి.

2లో


## పలు రైళ్లు రద్దు, మరికొన్ని దారి మళ్లింపు

- పలు రైళ్లను రద్దు చేసిన దక్షిణ మధ్య రైల్వే శాఖ
- ప్రయాణికుల కోసం హెల్ప్ లైన్ నెంబర్లు ఏర్పాటు

హైదరాబాద్ (తెలంగాణ ముచ్చట్లు)

రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాల వల్ల దక్షిణ మధ్య రైల్వే శాఖ పలు రైళ్లను రద్దు చేసింది. మరికొన్ని రైళ్లను మళ్లించింది. భారీ వర్షాల కారణంగా పట్టాలపైకి పైనుంచి వరదలు వస్తున్న కారణంగా ఈ నిర్ణయం తీసుకుంది.

మిగతా 2లో







# కామారెడ్డిలో వరద బీభత్సం

(మొదటి పేజీ తరువాయి)

నాలుగు గంటల వ్యవధిలోనే రామారెడ్డి ప్రాంతంలో 17 సెంటి మీటర్ల వర్షం కురిసింది. రెండు రోజులుగా కుండపోతగా కురిస్తున్న వర్షాలకు జనజీవనం అస్త వ్యస్తమైంది. డోంగ్లి మండలంలోని సిర్పూర్, పెద్దటాక్లీ గ్రామాల్లోని ప్రజలు ఇళ్లు ఖాళీ చేసి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతున్నారు. పొరుగు గ్రామాల్లోని తమ బంధువుల ఇళ్లలో తలదాచుకుంటున్నారు. చిన్నారులు, వృద్ధులు మద్నూర్ మండలంలోని మిర్జాపూర్ (సలాబత్ పూర్) ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఉంటున్నారు. పెద్ద టాక్లీలోని కొన్ని కుటుంబాలు డోంగ్లి మండల కేంద్రాల్లో తలదాచుకుంటున్నారు. పిట్లం మండలం కుర్తి గ్రామం పూర్తిగా జల దిగ్బంధంలో చిక్కుకుంది. నియోజకవ ర్గంలోని నిజాంసాగర్, కౌలాస్ నాలా జలాశయాల గేట్లు ఎత్తి నీటిని దిగువ మంజీరాలోకి విడుదల చేస్తు న్నారు. దీంతో ముంపు గ్రామాల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతా రావు బాధితులకు పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. ఇళ్లు వదిలి ఆలయా ల్లో తలదాచుకున్న వాళ్లతో ఆయన మాట్లాడి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

పల్వంచ మండలం బండారమేశ్వర్ పల్లి చుక్కా పూర్ మధ్యలో ఉన్న రోడ్డు వరద తీవ్రతకు కొట్టుకు పోయింది. బీబీపేట నుంచి కామారెడ్డికి వచ్చే దారిలో వరద ఉద్ధృతికి బ్రిడ్జి కుంగిపోవటంతో రాకపోకలు నిలిచిపోయాయి. బీబీపేట పెద్ద చెరువు కట్టకు బుంగ పడడంతో కట్టను కాపాడుకునేందుకు స్థానికులు విశ్వ ప్రయత్నం చేశారు. 200 బస్తాల సిమెంట్, రెండు ట్రాక్టర్ల వరిగడ్డి, భారీగా మట్టిని పోశారు. సిరికొండ మండలం కొండూరు శివారులో హైలెవెల్ వంతెన వద్ద రోడ్డు కొట్టుకుపోయింది. కప్పల వాగుకు భారీ వరద రావడంతో ఐదేళ్ల క్రితం నిర్మించిన వంతెన కొట్టుకుపోయి రాకపోకలు నిలిచిపోయాయి. వరద ఉద్ధృతికి కొండూరు, గడ్కోల్ గ్రామాలు జలమయ మయ్యాయి.



# మహా గణపతి దర్శనం కోసం తరలివస్తున్న లక్షలాది భక్తులు

(మొదటి పేజీ తరువాయి)

ఇక, భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని దాదాపు 600 మంది పోలీసులు గణపయ్య ప్రాంగణం లో గస్తీ కాస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకుంటున్నా రు. పోలీసులతో పాటు 60 సీసీ కెమెరాలతో భద్రతా పర్యవేక్షణ జరుగుతోంది. సెప్టెంబ ర్ 6వ తేదీ సాయంత్రం వరకు ప్రతిరోజూ ఉదయం 6 నుండి రాత్రి 11 గంటల వరకు భక్తులు దర్శనం చేసే అవకాశం కల్పిస్తున్నా రు. ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 6 వరకు ఖైర తాబాద్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించనున్నారు.

రాజస్థాన్‌కు చెందిన రేష్మ అనే గర్భిణి వినాయక చవితి రోజున ఖైరతాబాద్ మహా గణపతిని దర్శిం చుకోవడానికి వెళ్లింది. సాధారణ భక్తులతో పాటు క్యూలైన్లో నిల్చుని ఉంది. ఉన్నట్టుండి నొప్పులు మొదలయ్యాయి. ఆమె క్యూలైన్‌లోనే కిందపడిపో యింది. దీంతో అప్రమత్తమైన స్థానికులు ఆమెకు ప్రసవం చేశారు. అనంతరం ఆమెను కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. తల్లి,బిడ్డా ఇద్దరూ క్షేమంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడిరచారు.

# వరద ప్రభావిత ప్రాంతాల్లో ముఖ్యమంత్రి ఏరియల్ సర్వే

**కామారెడ్డి, (తెలంగాణ ముచ్చట్లు) :**

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు పడుతున్నాయి. కుండపోతగా కురుస్తున్న వానలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడు తున్నారు. కామారెడ్డి, మెదక్, సిద్ధిపేట, నిజామాబాద్, పెద్దపల్లి జిల్లాల్లో వచ్చిన వరదలతో పలువురు చిక్కుకుపోయారు. ఈ నేపథ్యంలో వరద ప్రభావిత ప్రాంతా ల్లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం ఏరియల్ సర్వే నిర్వహించా రు. సీఎం బృందం బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి బయల్దేరి పెద్దపల్లి జిల్లాకు చేరుకు న్నారు. ఏరియల్ వ్యూ ద్వారా గోదావరి, ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌ను పరిశీలించారు. సీఎం రేవంత్‌రెడ్డి వెంట మంత్రులు ఉత్తమ్



కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, తెలంగాణ సీఎస్, డీజీపీ జితేంద్ర, తదిత రులు ఉన్నారు. ఈ సందర్భంగా సీఎం రే వంత్‌రెడ్డి మాట్లాడారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు గోదావరి జలాలు గుండెకాయ అని ఉద్ఘాటించారు. కాళేశ్వరంపై జస్టిస్ పీసీ ఘోష్ ఇచ్చిన నివేదికపై అసెంబ్లీలో చర్చిస్తామని పేర్కొన్నారు. మామ, అల్లుడు ఎన్ని కుట్రలు చేసిన పాపాలు పోవని విమ ర్శించారు. అల్లుడు స్వాతిముత్యం.. మామ ఆణిముత్యమని ఎద్దేవా చేశారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో నీళ్లు నింపితే గ్రామాలే కొట్టుకుపోతాయని చెప్పుకొ చ్చారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యా రేజీల్లో లోపాలు ఉన్నాయని వెల్లడిరచారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో సాంకేతిక వైఫల్యం ఉందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో డిజైన్లు, నిర్మాణం, నిర్వహణ లోపం ఉందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొ న్నారు.

# స్థానిక సంస్థల ఓటర్ల జాబితా సవరణను వాయిదా వేయాలి

**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు) :**




రాష్ట్ర ఎన్నికల సంఘానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెం ట్ కేటీఆర్‌తో పాటు పార్టీ నేతలు లేఖ రాశారు. స్థానిక సంస్థల ఓటర్ల జాబితా సవరణను వెంటనే వాయిదా వేయాలని ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేశారు. వర్షాలు, వరదల దృష్ట్యా ఓటర్ల జాబితా సవరణ వాయిదా వేయాలని కోరారు. వరద పరిస్థితుల్లో ప్రజలు ఓటరు జా బితాలను చూడలేరని పేర్కొన్నారు. ప్రజలు, అధికారులు సవరణ ప్రక్రియలో పాల్గొనడం అసాధ్యమని తెలిపారు. పారదర్శక వాతావరణంలో మరోసారి సవరణ ప్రక్రియ చేపట్టాలని కోరారు. రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్ని కల నిర్వహణ కోసం పోలింగ్ కేంద్రాలు, తుది ఓటర్ల జాబితా విడుదలకు ఎన్నికల సంఘం మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో నోటిఫై చేయబడిన అన్ని గ్రామ పంచాయతీ ల్లో ఫొటోతో కూడిన ఓటర్ల జాబితాను తయారు చేసి ప్రచురించాలని జిల్లా పంచాయతీ అధికారులను రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. అయితే ఆగస్టు 28వ తేదీ లోపు గ్రామ పంచాయతీల ముసాయిదా ఓటర్ల జాబితా తయారీ చేసి గ్రామ పంచాయతీ, మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వార్డుల వారీగా ఓటర్ల జాబితా లను ప్రదర్శించాలని జారీ చేసిన నోటిఫికేషన్‌లో స్పష్టం చేసింది. ఇక ఆ మరునాడే.. అంటే ఆగస్టు 29వ తేదీన ఎంపీడీవోల ద్వారా మండల స్థాయిలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించనున్నా రు. ఆగస్టు 30వ తేదీన ఓటర్ల జాబితాపై అభ్యంతరాల స్వీకరిస్తామని ఎన్నికల సంఘం వెల్లడిరచింది. అలాగే ఆగస్టు 31వ తేదీన జిల్లా పంచాయతీ అధికారి గ్రామ పంచాయతీల వార్డుల వారీగా ఫొటో ఓటర్ల తుది జాబి తాలను ప్రచురణ చేస్తారని ఎన్నికల సంఘం తెలిపింది.

# ఇలాంటి వర్షం ఎన్నడూ పడలేదు

(మొదటి పేజీ తరువాయి)

మెదక్ జిల్లాలోని రాజాపేట గ్రామంలో వరదలో చిక్కుకొని చని పోయిన సత్యం కుటుంబాన్ని పరామ ర్శించడంతోపాటు పలు ప్రాంతాల్లో పరిస్థితిని దగ్గరుండి సమీక్షించారు. అనంతరం సిద్ది పేట పట్టణ కేంద్రంలో లోతట్టు ప్రాంతాలను ఎమ్మెల్యే హరీశ్ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా సిద్దిపేటలో 10 సెంటీమీటర్ల వర్షం పడిరదన్నా రు. తొగుట మండలంలో 20 సెంటీ మీటర్ల వర్షం పడి ప్రజలు ఇబ్బంది పడ్డారని.. గత 20 సంవత్సరాలలో సిద్దిపేటలో ఇలాంటి వర్షం ఎప్పుడు పడలేదన్నారు. భారీ వర్షం వల్ల సిద్ది పేటలో పలు కాలనీలు జలమయ మయ్యాయని.. సిద్దిపేటలో వచ్చిన వరదను తగ్గించడానికి నర్సాపూర్ చెరువుకు ఒక మీటర్ తొలిగించామ ని స్పష్టం చేశారు. నర్సాపూర్ చెరువు నీటిని శనిగరం వాగు, మందపల్లి వాగువైపు మళ్లించాం. భవిష్యత్తులో వరద వచ్చినపుడు ఎలా ముందస్తు చర్యలు చేపట్టాలో ఇంజనీరింగ్ అధికారులు ప్రణాళికలు చేయాలని సూచించామన్నారు. ప్రజలు కూడా సహకరించాలని ఈ సందర్భంగా హరీశ్ రావు కోరారు.

నాలాలు కబ్జాలు చేసి సెట్ బ్యాక్ లేకుండా ఇల్లు కట్టడం వల్ల ఇలాంటి ఇబ్బందులు వస్తాయి. నాలాలు కబ్జాలు చేసి ఇల్లు నిర్మించుకున్న తర్వాత వరదలు వస్తే బాధపడితే ఎలా..? అన్నారు. లోతట్టు ప్రాంతాలలో తక్కువ ధరకు వస్తున్నాయని ఇల్లు ని ర్మించుకునే విషయంలో ప్రజలు ఆలో చించుకోవాలన్నారు. రానున్న రోజుల్లో ప్రజలు సెట్ బ్యాక్ లేకుండా ఇల్లు నిర్మించుకోకూడదని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమ త్తంగా ఉండాలి. ప్రజలు ఆందోళన చెందొద్దని మున్సిపల్ అధికారులు ఎప్పటికప్పుడు పరవేక్షణ చేయాలన నిర్దేశించినట్టు హరీశ్ రావు చెప్పారు.



# తెలంగాణ బీఎస్పీ చీఫ్‌గా ఇబ్రాం శేఖర్

(మొదటి పేజీ తరువాయి)



గతంలో ఎమ్మార్పీఎస్‌లో పనిచేసిన ఇబ్రాం శేఖర్.. 2013లో బీఎస్పీ ఫౌండర్ కాన్షీరాం ఆశయాలతో బీ ఎస్పీలో చేరారు. ఇక అప్పటి నుంచి పార్టీలో వివిధ పదవుల్లో కొనసాగుతూ వచ్చారు. రెండు సార్లు జనరల్ సెక్రెటరీ గా, ఒకసారి స్టేట్ సెంట్రల్ కోఆర్డినేట ర్‌గా బాధ్యతలు నిర్వహించారు. బీఎస్పీ నుంచి పలుమార్లు ఎన్నికల్లో గెలిచిన ఏకైక నాయకుడిగా ఆయనకు మంచి పేరుంది.


**డిప్యూటీ మేయర్‌గా గెలవడం శేఖర్ రాజకీయ చతురత**

2006లో హైదరాబాద్ పరిధిలో ఉన్న బాలాపూర్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా సర్పంచ్‌గా గెలిచిన ఇబ్రాం శేఖర్.. అనంతరం ఆ ప్రాంతం గ్రేటర్ హైదరా బాద్ మున్సిపాలిటీలో విలీనం అయ్యాక 2013లో బాలాపూర్ మున్సిపల్ కౌన్సి లర్‌గా గెలిచారు. ఇక 2020లో బడం గ్‌పేట్ మున్సిపాలిటీగా అవతరించ డంతో మరోసారి కార్పొరేటర్‌గా గెలిచి డిప్యూటీ మేయర్‌గా ఎన్నికయ్యారు. బీఎస్పీ నుంచి ఒక్కడే గెలిచినప్పటికీ.. తన రాజకీయ చాకచక్యంతో డిప్యూటీ మేయర్ పదవిని దక్కించుకుని ఐదేళ్లు కొనసాగారు.

తెలంగాణ రాష్ట్రంలో వెనుకబడిన వర్గాల ప్రజలు అన్నిరంగాల్లో రాణిం చాలంటే రాజకీయంగా పురోగతి సాధించాలని తెలిపారు. బహుజనుల కు రాజ్యాధికారం దక్కినపుడే ఆర్థిక, రాజకీయ, సమానత్వం, అభివృద్ధి సాధ్యమవుతుందని నూతన అధ్యక్షుడు ఇబ్రాం శేఖర్ ఉద్ఘాటించారు. ఆధిప త్య అగ్రవర్ణాలు, రాజకీయ పార్టీలకు ఓట్లు వేసినంత కాలం బహుజనుల బతుకులు బాగుపడవని చెప్పుకొచ్చా రు. భారత రాజ్యాంగాన్ని మేనిఫెస్టో గా కలిగిన ఏకైక పార్టీ బీఎస్పీనేనని తెలిపారు. ఓటు ఒక పోరాట సాధనమ ని, దాన్ని అమ్ముకోవడం తమను తాము అమ్ముకోవడమేనని , బహుజనులు ఓటును పదునైన ఆయుధంగా వాడి అధికారంలోకి రావాలన్నది బీఎస్పీ సిద్ధాంతమని, ప్రస్తుత పరిస్థితుల్లో దేశానికి బెహన్ మాయావతి మార్గని ర్దేశకత్వం చాలా అవసరమని ఆయన పేర్కొన్నారు.

# ప్రాణం మీదకు తెచ్చిన పందెం

(మొదటి పేజీ తరువాయి)



వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఈ నేపథ్యంలోనే సూర్యాపేట జిల్లాలో కొందరు యువకులు అత్యుత్సాహం ప్రదర్శించారు. పొంగిపొర్లుతున్న వాగు దాటే పందెం వేసుకున్నారు. ఈ నేపథ్యంలోనే ఓ యువకుడు ప్రమాదానికి గురయ్యాడు. వరదలో కొట్టుకుపోయాడు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళితే.. అనంతగిరి మండలం గొండ్రియాలలో పాలేరు వాగు పొంగిపొర్లుతోంది. ఏం పిచ్చిపట్టిందో ఏమో కానీ, ఓ ముగ్గురు యువకులు ఉధృతంగా పొంగి పొర్లుతున్న వాగు దాటాలని పందెం వేసుకున్నారు. పందెంలో భాగంగా ముగ్గురూ వాగు దాటుతున్నారు. ఈ నేపథ్యంలోనే వరద పోటెత్తడంతో ఓ యువకుడు కొట్టుకుపోయాడు. సమాచారం అందుకున్న గ్రామస్థులు, పోలీసులు వాగు దగ్గరకు చేరుకున్నారు. యువకుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. విషయం తెలుసుకున్న యువకుడి కుటుంబసభ్యులు బోరున విలపిస్తూ పాలేరు వాగు వద్దకు చేరుకున్నారు. మరోవైపు హైదరాబాద్ చాదర్ ఘాట్ శంకర్ నగర్ వద్ద మూసీలో మరో వ్యక్తి గల్లంతయ్యాడు. శంకర్ నగర్‌కు చెందిన సలీం ఖురేషి(40) ఈత కొడుతూ ప్రవాహంలో కొట్టుకుపోయాడు. కాగా, ఖురేషి కోసం హైడ్రా, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి.

# పలు రైళ్లు రద్దు, మరికొన్ని దారి మళ్లింపు

(మొదటి పేజీ తరువాయి)



వరద దృష్ట్యా రైళ్ల దారి మళ్లింపు సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. కామారెడ్డి జిల్లాలో భారీగా వర్షాలు కురుస్తున్నాయి. హైదరాబాద్ డివిజన్ పరిధిలోని బిక్కనూర్ తల్మడ సెక్షన్, అక్కన్నపేట్ మెదక్ సెక్షన్‌లో రైలు పట్టాలపై భారీగా వరదనీరు ప్రవహించడంతో పలు రైళ్లను రద్దు చేయడంతో పాటు, కొన్ని రైళ్లను దారి మళ్లించడంతో పాటు, మరికొన్ని రైళ్లను పాక్షికంగా రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది.

రద్దైన రైళ్ల వివరాలు ఇవే : కరీంనగర్ కాచిగూడ, కాచిగూడ నిజామాబాద్, మెదక్ కాచిగూడ, కాచిగూడ మెదక్, బోధన్ కాచిగూడ, ఆదిలాబాద్ తిరుపతి, నిజామాబాద్ కాచిగూడ వెళ్లాల్సిన రైళ్లను పూర్తిగా రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే స్పష్టం చేసింది. మహబూబ్ నగర్ కాచిగూడ రైలును పాక్షికంగా రద్దు చేసినట్లు సీపీఆర్.ఓ శ్రీధర్ తెలిపారు.

దారి మళ్లించిన రైళ్ల వివరాలు : రాయచూర్ పర్బని సర్వీసును వికారాబాద్ పర్లీవైజ్నాత్ వికారాబాద్ మీదుగా, హెచ్.ఎస్.నాందేడ్ రాయచూర్ హెచ్.ఎస్ వెళ్లాల్సిన సర్వీసును నాందేడ్ పూర్నా పర్లీ వైజ్నాత్ వికారాబాద్ మీదుగా , బిక్కనూర్ కాచిగూడ పూర్నా పర్బనీ పర్లీ వైజ్నాత్ వికారాబాద్ సికింద్రాబాద్ మీదుగా, హైసర్ హైదరాబాద్ వెళ్లాల్సిన సర్వీసును పర్బనీ పర్లీ వైజ్నాత్ వికారాబాద్ హుస్సేన్ సాగర్ జంక్షన్ హైదరాబాద్ డెక్కన్ మీదుగా, షాద్‌నగర్ కాచిగూడ, మన్మాడ్ కాచిగూడ వెళ్లాల్సిన అజంతా ఎక్స్‌ప్రెస్‌ను పర్బనీ పర్లీ వైజ్నాత్ వికారాబాద్ సికింద్రాబాద్ మీదుగా దారి మళ్లించినట్లు దక్షిణ మధ్య రైల్వే వెల్లడిరచింది.





# సత్తుపల్లిలో గణపతి పూజల్లో ఎమ్మెల్యే మట్టా రాగమయి దంపతులు

- భక్తులకు వినాయక చవితి శుభాకాంక్షలు.

**సత్తుపల్లి, ఆగస్టు 28 (తెలంగాణ ముచ్చట్లు):**

సత్తుపల్లి పట్టణం అంతా గణపతి నవ రాత్రుల సంబరాలతో కళకళలాడింది. గలగల మేళతాళాలు, గాజుల మోగింపు, వినాయక భజనలు, శంఖధ్వనులు, హారతుల కాంతులతో పట్టణం ఉత్సవ వాతావరణంలో మునిగిపోయింది. ఈ సందర్భంగా బుధవారం సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మట్టా దయానంద్ దంపతులు పట్టణంలోని వివిధ గణపతి మండపాల్లో పూజల్లో పాల్గొన్నారు.

మొదటగా ద్వారకాపూరి కాలనీలోని ఎమ్మెల్యే శిబిర కార్యాలయంలో గణపతి పూజ నిర్వహించారు. భక్తులతో కలిసి ప్రత్యేక పూజలు చేసి, నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

తదుపరి కోదండరామాలయం సన్నిధిలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపానికి చేరుకున్నారు. ఆలయ ప్రాంగణం భక్తులతో నిండిపోయి ఘనంగా సాగిన పూజల్లో పాల్గొని, భక్తులతో కలసి ప్రసాదాన్ని స్వీకరించారు.

జలగం పార్కు ఎదుట ఉన్న ప్రసన్న గణపతి మండపంలో ఎమ్మెల్యే దంపతులు ప్రత్యేక పూజలు చేసి, అనంతరం అన్నప్రసాదంలో పాల్గొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై "గణపతి బప్పా మోరియా" నినాదాలతో మండపాన్ని మార్మోగించారు. అదే విధంగా జలగం పార్కు వద్ద డబుల్ బెడ్ రూం కాలనీలో ఏర్పాటు చేసిన గణపతి మండపానికి చేరుకున్న ఎమ్మెల్యే దంపతులు కాలనీవాసులతో కలిసి పూజల్లో పాల్గొన్నారు.

ఈ పూజా కార్యక్రమాల్లో దోమ ఆనంద్, గాదె చెన్నారావు, గ్యాస్ సత్యనారాయణ, శ్రీధర్, చల్లగుళ్ల నరసింహారావు, కమల్ పాషా, గణేష్ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, యువ నాయకులు, భక్తులు పాల్గొని గణపతి నవ రాత్రులను విజయవంతం చేశారు.

సత్తుపల్లి పట్టణం మొత్తం ఉత్సాహభరిత వాతావరణంలో గణపతి నవరాత్రులను జరుపుకుంటుండగా, ప్రతి వీధిలో, ప్రతి కాలనీలో భక్తులు మండపాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. సాంప్రదాయం, భక్తి, ఉత్సాహం కలిసిన ఈ వేడుకల్లో ఎమ్మెల్యే దంపతుల పాల్గొనడం ప్రజల్లో ఉత్సాహాన్ని రెట్టింపు చేసింది.

# ఇంట్లో నిద్రిస్తున్న తల్లీకూతుళ్ల పై పాము కాటు

- చెల్లిని కోల్పోయిన రిషికా కన్నీటి ముద్ద

**సత్తుపల్లి, ఆగస్టు 28 (తెలంగాణ ముచ్చట్లు):**





మండలంలోని చిన్నపాకల గూడెం గ్రామంలో గురువారం తెల్లవారుజామున చోటుచేసుకున్న దుర్ఘటన గ్రామాన్ని విషాదంలో ముంచేసింది. ఇంట్లో నిద్రిస్తున్న తల్లీకూతుళ్లపై పాము కాటు వేసి చిన్నారి ప్రాణాలు బలిగొన్న సంఘటన అందరినీ కలచివేసింది.

బంధువులు తెలిపిన వివరాల ప్రకారం, గ్రామానికి చెందిన గౌర గోపి (28), మౌనిక (25) దంపతులు తమ ఇద్దరు కుమార్తెలు రిషికా (8), లోహిత (5)తో కలిసి ఇంట్లో నేలపై నిద్రిస్తుండగా, గురువారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో కట్ల పాము (విషసర్పం) ఇంట్లోకి చొరబడి చిన్నారి లోహితతో పాటు తల్లి మౌనికను కాటు వేసింది.

సమయం వృథా చేయకుండా కుటుంబ సభ్యులు పామును చంపి, బాధితులను 108 వాహనంలో సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కానీ చికిత్స పొందుతూ చిన్నారి లోహిత (5) మృతి చెందింది. పరిస్థితి విషమంగా మారిన తల్లి మౌనికను మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. లోహిత మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం మార్చురీలో ఉంచారు.

ఈ ఘటనతో అక్క రిషికా (8) చెల్లిని కోల్పోయి కన్నీటి ముద్దయింది. గ్రామమంతా విషాద ఛాయలు కమ్ముకున్నాయి. గ్రామస్తులు లోహిత మృతికి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.



# నాచారం ప్రజల క్షేమం కోసం విఘ్నేశ్వరుని ప్రార్థించిన కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్

**నాచారం, ఆగస్ట్ 28 (తెలంగాణ ముచ్చట్లు)**

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ తమ నివాసంలో మట్టి వినాయకుని ప్రతిష్టించి, కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంప్రదాయ రీతిలో పూజలు, హోమాలు నిర్వహించిన అనంతరం, విఘ్నేశ్వరుడు నాచారం డివిజన్ ప్రజలందరికీ ఆరోగ్యం, ఆనందం, అభివృద్ధి కలగాలని ఆయన ప్రార్థించారు.

పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్టించడం ద్వారా పర్యావరణ హిత వినాయక చవితి జరుపుకోవాలని సందేశమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అంకితభావంతో పనిచేస్తాను. నాచారం డివిజన్ అభివృద్ధి కోసం అన్ని చర్యలు తీసుకుంటాను" అని పేర్కొన్నారు.

ఈ పూజ కార్యక్రమంలో ఆయన కుటుంబ సభ్యులు, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సాయి జన్ శేఖర్ కుమారుడు సాయి దేవ్, కూతురు సాహితి పాల్గొని వినాయక పూజలు చేశారు. నివాసానికి విచ్చేసిన బంధువులు, నాయకులు, స్థానికులు కార్పొరేటర్ కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపారు.

# బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే

**వనపర్తి,ఆగస్టు28(తెలంగాణ ముచ్చట్లు):**




పలు ఆరోగ్య సమస్యలతో హైదరాబాదులోని అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను గురువారం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పరామర్శించారు.

తన వ్యక్తిగత వాహన చోదకుడు సంపత్ రెడ్డి తల్లి గత కొంతకాలంగా మెదడుకు సంబంధించిన సమస్యలతో చికిత్స పొందుతున్నారు. ఆమెను ఎమ్మెల్యే పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

అలాగే పెద్దమందడి మండలం వెల్టూరు గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి కాలికి శస్త్ర చికిత్స చేయించుకుని అదే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గురువారం ఆయన్ను పరామర్శించారు. వైద్యుల నుండి చికిత్స విధానంపై వివరాలు తెలుసుకొని, మెరుగైన వైద్యసేవలు అందించాలంటూ ఆసుపత్రి వర్గాలను కోరారు.

ఈ కార్యక్రమంలో వెల్టూర్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, మణిగిళ్ల తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# భగత్ సింగ్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా గణపతి పూజ

**నాచారం, ఆగస్టు 28 (తెలంగాణ ముచ్చట్లు):**

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని నాచారం భగత్ సింగ్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా గణపతి పూజలు నిర్వహించారు. కులమతాలకు అతీతంగా స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై గణనాథుని ఆశీస్సులు అందుకున్నారు. ఈ పూజల సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అలంకరణలు, విద్యుత్ దీపాలంకరణలు ఆకట్టుకున్నాయి.

ముఖ్య అతిథిగా హాజరైన మక్తల శేఖర్ గౌడ్ వినాయకుడికి 43 కిలోల లడ్డూను సమర్పించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా శేఖర్ గౌడ్ మాట్లాడుతూ, "ప్రజల ఐక్యతకు వినాయక చవితి పండుగ ప్రతీక. సమాజంలో సామరస్యాన్ని పెంపొందించడంలో ఇలాంటి ఉత్సవాలు కీలక పాత్ర పోషిస్తాయి" అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, భగత్ సింగ్ యూత్ సభ్యులు, ప్రాంతీయ యువజన నాయకులు పాల్గొని, పండుగ ఉత్సాహాన్ని మరింత పెంచారు. సాంస్కృతిక కార్యక్రమాలు, భక్తి గీతాలు, పూజా విధానాలు స్థానికులను ఆకట్టుకున్నాయి.

# రోటరీ క్లబ్ వారిచే క్రీడాదుస్తుల పంపిణీ

**హసన్ పర్తి,ఆగస్టు28 ( తెలంగాణ ముచ్చట్లు):**



హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలం జయగిరి గ్రామంలో గల మండల ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు జి.శ్రీధర్ ఆధ్వర్యంలో క్లబ్ మెంబర్ పైళ్ళ మైపాల్ రెడ్డి పాఠశాల విద్యార్థులకు 90 వేల విలువగల క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల విద్యాధికారి ఎ.శ్రీనివాస్ రెడ్డి హాజరై మాట్లాడుతూ దాతలు ఇచ్చే ప్రోత్సాహంతో విద్యార్థులు ఉన్నత స్థితికి చేరుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు బేతి రవీందర్ రెడ్డి, కార్యదర్శి గంగోజుల నరేష్, క్లబ్ మెంబర్స్ ఎం.సతీష్ కుమార్,ఎ.విజయ్ కుమార్,ప్రభాకర్ రెడ్డి,అన్నం రవీంద్రనాథ్,రత్న మంజుల, నరహరి మనోహర్ రెడ్డి, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారిని కలిసిన జమాతే ఇస్లామీ హింద్ బృందం

**ఖమ్మం బ్యూరో, ఆగస్టు 28, తెలంగాణ ముచ్చట్లు:**



జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన మహమ్మద్ ముజాహిద్ ను జమాతే ఇస్లామీ హింద్ బృందం మర్యాద పూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ మైనారిటీ సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న పథకాలన్నీ అట్టడుగున ఉన్న పేదలందరికీ అందేటట్లు చూడాలని కోరారు. అంతేగాక మైనారిటీ గురుకుల విద్యాలయాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించి 100% అడ్మిషన్స్ పూర్తి అయ్యేటట్లు చూడా లన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి చేరవేయటంలో జమాతే ఇస్లామీ హింద్ పూర్తి సహకారం అందిస్తుందన్నారు ఈ బృందంలో జిల్లా అధ్యక్షులు జైనుల్ పాషా , ఉపాధ్యక్షులు అబ్దుల్ సమీ మీడియా సెక్రెటరీ అబ్దుల్ మలిక్ ఐట రీజినల్ సెక్రెటరీ మొహమ్మద్ ముజీబ్ మరియు ఏజాస్ పాల్గొన్నారు..

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## వికలాంగుల హక్కుల పోరాట సమితి 18వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా

**మల్కాజ్గిరి, ఆగస్టు 28 (తెలంగాణ ముచ్చట్లు)**

మేడ్చల్‌మల్కాజ్గిరి జిల్లా వికలాంగుల హక్కుల పోరాట సమితి (విహెచ్పిఎస్) 18వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మంగళవారం మల్కాజ్గిరి చౌరస్తాలో ఘనంగా జరిగాయి. జిల్లా విహెచ్పిఎస్ అధ్యక్షులు ఎన్. వినయ్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ చేసి, కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

2007లో మంద. కృష్ణ మాదిగ స్థాపించిన ఈ సమితి పోరాటాల ఫలితంగా వికలాంగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులు, చేనేత కార్మికుల పెన్షన్లు గణనీయంగా పెరిగాయని నాయకులు గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వాగ్దానం చేసిన పెన్షన్ పెంపు ఇప్పటికీ అమలుకాకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తూ, పెండింగ్‌లో ఉన్న పెన్షన్లు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

సెప్టెంబర్ 9న పెరేడ్ గ్రౌండ్‌లో మహాగర్జన నిర్వహించనున్నట్లు ప్రకటించారు. "హక్కులు పోరాటాల ద్వారానే సాధ్యం" అని ఎం ఆర్ పి ఎస్ జాతీయ నాయకులు తిప్పరపు లక్ష్మణ్ మాదిగ స్పష్టం చేశారు.

ఈ వేడుకలో జర్నలిస్ట్ ఫోరమ్ రాష్ట్ర నాయకులు మనోహర్, విహెచ్పిఎస్ నాయకులు షైఖ్ షబానా, ఎన్. శాంతబాయి, బండారి లక్ష్మి, వై. రాము, ఎల్. సోను, పి. రజిత, వెంకటేష్, ఆర్. జ్యోతి, కౌసర్ బేగం, అన్నపూర్ణమ్మ, కీర్తి, ముత్తమ్మ, పోచమ్మ, ప్రకాష్, సరస్వతి, భారతమ్మ, లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఐ ఐ సి టి వద్ద బాటిల్ నెక్ రోడ్డును వెడల్పు చేయా

**నాచారం, ఆగస్టు 28 (తెలంగాణ ముచ్చట్లు)**



నాచారం ప్రధాన రహదారి హబ్సిగూడ చౌరస్తా నుండి నాచారం వైపు వెళ్లే మార్గంలో ఐ ఐ సి టి ఇన్స్టిట్యూట్ ఎడమవైపు, క్వార్టర్స్ కుడివైపు ఉన్నాయి. ఈ రెండు మధ్యలో ఉన్న రహదారి కేవలం 50 అడుగుల వెడల్పు మాత్రమే ఉండటంతో ప్రతి రోజు తీవ్రమైన ట్రాఫిక్ సమస్యలు ఎదురవు తున్నాయి.పెరుగుతున్న జనాభా, వాహనాల రద్దీ కారణంగా ఈ ప్రాంతం బాటిల్ నెక్‌గా మారి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించేందుకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి, ఐ ఐ సి టి డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డిని కలసి రహదారి వెడల్పు చేయడంలో సహకరించాలని కోరారు.

డైరెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ జిహెచ్ఎంసి అధికారుల ద్వారా రోడ్డువెడల్పుపై అధికారిక లేఖ పంపించాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను కలిసి రహదారి విస్తరణకు తగిన కార్యాచరణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా పూజలు అందుకున్న గణనాథుడు

**నాచారం, ఆగస్టు 28 (తెలంగాణ ముచ్చట్లు)**

నాచారంలో వినాయక చవితి సందర్భంగా గణనాథుడు ఘనంగా పూజలు అందుకున్నాడు. నాచారం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడుశ్రీరామ్ సత్యనారాయణ ప్రత్యేకించి ముంబై నుండి సిద్ధి వినాయకుడు విగ్రహం తెప్పించి స్వగృహంలో అంగరంగ వైభవంగా విఘ్నేశ్వరుని పూజలు నిర్వహించారు. లంబోదరని మండపాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. వివిధరకాల పూలు,పత్రీ తో వినాయకునికి ఇష్టమైన నైవేద్యాలతో అర్చకులు వేదమంత్రాలతో మంగళ వాయిద్యాలుచే వినాయక మంత్రం జపిస్తూ భక్తిశ్రద్ధలతో శ్రీరామ్ సత్యనారాయణ కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి కోసం చేసిన అలంకరణ ఎంతో గాను ఆకట్టుకుంది.

## అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు తోటకూర వజ్రేష్ యాదవ్

**మేడ్చల్, ఆగస్టు 28 (తెలంగాణ ముచ్చట్లు)**



మేడ్చల్ నియోజకవర్గ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు ప్రతాలు పంపిణీ కార్యక్రమం మున్సిపల్ కమిషనర్ సత్యప్రకాశ్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ప్రధాన అతిథిగా నియోజకవర్గ ఇంచార్జి తోటకూర వజ్రెష్ యాదవ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులు యాదవ్, జిల్లా ఆర్‌టిఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ మర్రి దీపిక నర్సింహారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ రమేష్, పార్టీ నాయకు లు వేముల శ్రీనివాస్ రెడ్డి, గోమారం రమణ రెడ్డి, సాయిపేట్ శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.వజ్రెష్ యాదవ్ మాట్లాడుతూ,రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నా కూడా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కేటాయించిన రూ!5 లక్షలు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా నాలుగు విడతల్లో జమ అవుతున్నాయి అని తెలిపారు.

బేస్మెంట్ పూర్తయిన తర్వాత రూ!1 లక్ష గోడల నిర్మాణం తర్వాత రూ!1.25 లక్షలు స్లాబ్ పూర్తయిన తర్వాత రూ!1.75 లక్షలు మిగతా పనులు పూర్తయిన తర్వాత రూ!1 లక్ష మొదటి విడతలో 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యాయి. మిగిలిన ఇండ్ల నిర్మాణాన్ని త్వరలో ప్రారంభిస్తామని, ఇంకా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇండ్లు అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు.





# గురుకుల పాఠశాలపై ఆకస్మిక తనిఖీ

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- పాఠశాల పరిసరాలు శుభ్రంగా లేకపోవడంపై ఆగ్రహం
- టాయిలెట్లు, డ్రైనేజీ, స్ట్రీట్ లైట్స్ మరమ్మతులకు ఆదేశం
- వర్షా కాలం నేపథ్యంలో పరిసర పరిశుభ్రత తప్పనిసరి
- మంచినీటి సరఫరా కలుషితం కాకుండా చర్యలు
- విద్యార్థుల భోజనంలో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరి
- ఉపాధ్యాయులకు – ఐఐటీ, ఎన్ఐటీ సీట్ల లక్ష్యం

**స్టేషన్ ఘనపూర్, ఆగస్టు 28 (తెలంగాణ ముచ్చట్లు)**

స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే, మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి గురువారం స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన పాఠశాల పరిసరాలు, హాస్టల్ భవనాలు, కిచెన్, వాటర్ ప్లాంట్‌ను పరిశీలించారు. మరుగుదొడ్లు, పరిసర పరిశుభ్రత సరిగా లేవని గమనించి ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే మరమ్మతుల ప్రతిపాదనలు సిద్ధం చేసి పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

తరచూ కురుస్తున్న వర్షాల కారణంగా పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మంచినీటి సరఫరా ఎట్టి పరిస్థితుల్లోనూ కలుషితం కాకూడదని హెచ్చరించారు. విద్యార్థులకు అందించే భోజనంలో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు.

**అనంతరం విద్యార్థులతో మాట్లాడిన శ్రీహరి –**

"మీకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా నేరుగా నాకు చెప్పండి. మీకు అన్ని సౌకర్యాలు కల్పించడం నా బాధ్యత. మీరు బాగా చదివి మంచి మార్కులు సాధించాలి" అని చెప్పారు.

**ఉపాధ్యాయులకు సూచిస్తూ –**

"ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి. ఇంటర్ విద్యార్థులు ఐఐటీ, ఎన్ఐటీలలో సీట్లు సాధించేలా శిక్షణ ఇవ్వాలి. వారిని ఎప్పటికప్పుడు ప్రోత్సహించాలి" అని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో వెంకన్న, పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# జిల్లాకు 500 మెట్రిక్ టన్నుల యూరియా

- రైతులకు కొరత రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి – కడియం శ్రీహరి

**స్టేషన్ ఘనపూర్, ఆగస్టు 28(తెలంగాణ ముచ్చట్లు)**





రైతులకు యూరియా కొరత రాకుండా చూడాలని అధికారులు కృషి చేయాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సూచించారు.

జనగామ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ఆధ్వర్యంలో యూరియా సరఫరా, సాగునీటి అంశాలపై జరిగిన సమీక్ష సమావేశం గురువారం నిర్వహించారు.

**అనంతరం కడియం శ్రీహరి మాట్లాడుతూ –**

"జిల్లాకు ఇప్పటికే 500 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చింది. రైతులకు పంపిణీ చేసే సమయంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ విధానం పాటించాలి. ప్రతి రైతుకు ఇచ్చే యూరియా వివరాలను కచ్చితంగా రికార్డుల్లో నమోదు చేయాలని తెలిపారు.

అలాగే, సాగునీటి విషయంలో ముందుగానే ప్రణాళికలు సిద్ధం చేసి, రిజర్వాయర్లలో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించి చివరి ఆయకట్టువరకు నీరు చేరేలా చర్యలు తీసుకోవాలి అని సూచించారు.

తర్వాత ఎమ్మెల్యే, కలెక్టర్‌తో కలిసి స్టేషన్ ఘనపూర్ బాలుర సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని పరిశీలించారు. అక్కడ త్రాగునీటి సరఫరా, మరుగుదొడ్ల నిర్మాణం, భవన మరమ్మతులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన కలెక్టర్‌ను కోరారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షా లోమ్, ఆర్డీఓ వెంకన్న, వ్యవసాయ శాఖ అధికారి అంబికా సోనీ, నీటిపారుదల శాఖ ఎస్.ఇ సుధీర్, డి.ఈలు సునీల్‌కుమార్, రవికుమార్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రైనేజీ సమస్యతో శివ సాయి నగర్ వాసుల ఆవేదన.!

**సత్తుపల్లి, ఆగస్టు 28(తెలంగాణ ముచ్చట్లు):**





సత్తుపల్లి పట్టణంలోని కాకర్లపల్లి రోడ్డుకు ఆనుకుని ఉన్న శివ సాయి నగర్ కాలనీ వర్షాకాలం మొదలైనప్పుడల్లా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. కాలనీలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షాలు పడగానే డ్రైనేజీ నీరు పొంగిపొర్లి రోడ్లపైకి వచ్చి ఇళ్లలోకి చేరుతోంది.

స్థానికులు చెబుతున్న వివరాల ప్రకారం గత కొన్ని సంవత్సరాలుగా పలుమార్లు అధికారులకు, గత ప్రభుత్వానికి సమస్యను తెలియజేసినా పెద్దగా స్పందన రాలేదు. ప్రస్తుత ప్రభుత్వం మరియు అధికారులు కాలనీని సందర్శించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా ఇప్పటివరకు అమలు కాలేదని వాసులు ఆరోపిస్తున్నారు.

దీని వల్ల ప్రతి ఏడాది వర్షాకాలంలో కాలనీలో జ్వరాలు, డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతూ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కాలనీ మొత్తం నీటమునిగిపోయి ప్రజలు ఇళ్లలో నుంచే ఇబ్బందులు పడుతున్నారు.

కాలనీ వాసులు తమ సమస్యను స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దృష్టికి తీసుకెళ్లారు.

అలాగే రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ కూడా ప్రత్యక్షంగా పరిశీలించి అధికారుల ద్వారా వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సమస్యను తక్షణమే పరిష్కరించకపోతే కాలనీని వదిలి వెళ్లే పరిస్థితి వస్తుందని వాసులు ఆవేదన వ్యక్తం చేశారు





# నూతన వినాయక మండపాన్ని ప్రారంభించిన కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్

- ఐక్యతకు ప్రతీకగా నిలిచిన శ్రీనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్

**చిలుక నగర్, ఆగస్టు 28 (తెలంగాణ ముచ్చట్లు)**

చిలుక నగర్ డివిజన్‌లో వినాయక చవితి పండగ వేడుకల సందడి నడుమ శ్రీనగర్ కాలనీ ప్రజలు నిర్మించిన నూతన వినాయక షెడ్ మరియు మండపం ఘనంగా ప్రారంభించారు.జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు, కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ ప్రత్యేక ఆహ్వానితులుగా విచ్చేసి ఈ మండపాన్ని ప్రారంభించి కాలనీ ప్రజలతో కలిసి వినాయకుని పూజలో పాల్గొన్నారు.కార్పొరేటర్ మాట్లాడుతూ స్వీయ నిధులతో షెడ్ నిర్మాణం ప్రశంసనీయం: గీతా ప్రవీణ్ అన్నారు శ్రీనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తమ సొంత నిధులతో మండపాన్ని నిర్మించడం సమాజానికి ఆదర్శమని అభినందించారు.కాలనీ ఐక్యత ప్రశంసలు: కాలనీ ప్రజల ఐక్యతకు ఈ నిర్మాణం ఒక చిహ్నమని పేర్కొన్నారు.

మిగిలిన పనుల హామీ: ప్రహరీ గోడ ఎత్తు పెంచడం, గేట్ అమరిక, సిమెంట్ ఫ్లోరింగ్, ఎలక్ట్రిక్ పోల్స్ మరియు లైటింగ్ పనులను తక్షణమే పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు.

కాలనీ ప్రజల ఉత్సాహం వినాయక చవితి పండగ రోజున కొత్త మండపం ప్రారంభం కావడంతో కాలనీ ప్రజలు ఆనందోత్సాహాలతో పండుగ వాతావరణాన్ని మరింత అందంగా తీర్చిదిద్దారు. చిన్నారుల నుండి పెద్దల వరకు అందరూ పాల్గొని పూజలు, శుభాకాంక్షలతో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు కొండయ్య, మురళీధర్ రెడ్డి, శ్రీనివాస్, వేణు గోపాల్ రెడ్డి, యువ సాయి, ప్రభాకర్ రెడ్డి, దినేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక


# శ్రీనగర్ కాలనీలో ముంపు సమస్యలపై కసరత్తు

◆ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి నేతృత్వంలో జాయింట్ ఇన్‌స్పెక్షన్

**మల్కాజిగిరి, ఆగస్టు 28 (తెలంగాణ ముచ్చట్లు):**





మల్కాజిగిరి నియోజకవర్గంలోని ఈస్ట్ ఆనంద్ బాగ్ శ్రీనగర్ కాలనీలో వరుసగా వర్షాలు కురిసే ప్రతిసారి నీటమునిగే సమస్యలు స్థానిక ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ముందడుగు వేసి సంబంధిత శాఖల అధికారులతో కలిసి జాయింట్ ఇన్స్పెక్షన్ నిర్వహించారు.ఎమ్మెల్యే కాలనీ అంతటా పర్యటించి ముంపు ప్రాంతాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. డ్రైనేజీ నీరు నిలిచిపోకుండా ఉండేందుకు, వర్షపు నీరు సమర్ధవంతంగా వెళ్లిపోయేలా డ్రైనేజీ లైన్ల విస్తరణ, కొత్త లైన్ల ఏర్పాటు, రోడ్డు స్థాయిల సరిచేత వంటి శాశ్వత చర్యలపై చర్చించారు. స్థానిక ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను విన్న ఎమ్మెల్యే, ప్రజలు వర్షాకాలంలో ఇబ్బందులు పడకుండా తక్షణ, దీర్ఘకాలిక చర్యలు తీసుకుంటాం” అని హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యే ఈ సందర్భంగా అధికారు లను ఉద్దేశించి మాట్లాడుతూ:

శ్రీనగర్ కాలనీ వంటి లోతట్టు ప్రాంతాలు ముంపుతో ఇబ్బందులు పడుతున్నాయి. ప్రజల సమస్యలు తక్షణమే పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి శాశ్వత పరిష్కారం చూపాలి, అన్నారు. ఈ కార్యక్రమాల్లో జాయింట్ ఇన్స్పెక్షన్‌లో రైల్వే శాఖ నుంచి ప్రాంజల్, కేసరి వాణి, బ్రహ్మానందం, అన్వర్ అహ్మద్, జిహెచ్ఎంసి మల్కాజిగిరి సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లక్ష్మణ్, అసిస్టెంట్ ఇంజనీర్ నవీన్, జలమండలి జనరల్ మేనేజర్ సునీల్, డీజీఎం ఆశ్రిత పాల్గొన్నారు.బిఆర్ఎస్ నాయకులు జేపీసీ వెంకన్న, మురుగేష్, చిన్న యాదవ్, నవీన్ యాదవ్, శ్రీధర్ మేరు, హేమంత్ పటేల్, సూర్య ప్రకాష్, వేణు, శ్రీధర్, శ్రీనివాస్, వెంకటేష్ రాజు, వాసు తదితరులు, కాలనీ ప్రజల తరఫున నయీం, రఫీక్, మోయిన్, రజిని, వైశాలి, సునీత తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వయోజన విద్యా కేంద్రాల నిర్వహణకు సర్వం సిద్ధం : మిరియాల రాజు

**వేంసూరు, ఆగస్టు 28 (తెలంగాణ ముచ్చట్లు ):**






ఖమ్మం జిల్లా వేంసూరు మండలం వెంకటాపురం గ్రామంలోని రైతు వేదికలో వయోజన విద్యా కేంద్రాలు ప్రారంభమయ్యాయి. చెన్నైకి చెందిన లిటరసి ఇంటర్ ఇండియా ట్రస్ట్ ఆర్థిక సహకారంతో షాలేం ప్రేయర్ మినిస్ట్రీ ఆధ్వర్యంలో ఈ కేంద్రాలు ఏర్పాటు అయ్యాయి.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఫిజియోథెరపీ నిపుణుడు డాక్టర్ వీర్ల కిరణ్ కుమార్ శిక్షణ పొందిన ఉపాధ్యాయులకు పలకలు, బ్లాక్ బోర్డులు, లైట్లు, పుస్తకాలు పంపిణీ చేశారు.

మాట్లాడుతూ ఆయన వయోజనులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని అక్షరాస్యతను సాధించాలని సూచించారు. చదువు రాకపోతే జీవితంలో ఎదురయ్యే ఇబ్బందులు ఎక్కువగా ఉంటాయని, చదువు వచ్చిందంటే కుటుంబ జీవనంలో సౌకర్యాలు పెరుగుతాయని, ఆరోగ్యంపై శ్రద్ధ పెరుగుతుందని, పరిసరాల్లో కూడా మంచి మార్పులు వస్తాయని వివరించారు.

ఈ సందర్భంగా షాలేం ప్రేయర్ మినిస్టర్ చీఫ్ ఫంక్షనర్ సిజెడబ్ల్యూకే జాన్ బాబు కూడా మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో 100 శాతం అక్షరాస్యత సాధించడమే ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

వ్యవస్థాపకులు మిరియాల రాజు ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు, పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఆఫీసర్స్ మిర్యాల రవి, కాటుంగ నాగేంద్రబాబు, యానిమేటర్స్ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లోకి...

## రాయగూడెనికి చెందిన 60 కుటుంబాలు చేరిక

◆ కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన దయాకర్ రెడ్డి

**ఖమ్మం బ్యూరో, ఆగస్టు 28, తెలంగాణ ముచ్చట్లు:**





నేలకొండపల్లి మండలం రాయగూడెం గ్రామానికి చెందిన సుమారు 60 కుటుంబాలు బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లోకి గురువారం చేరాయి. ఈ చేరికలు మాజీ ఎంపీపీ కొర్లకుంట నాగేశ్వరరావు, మండల నాయకులు నంబూరి రామారావు ఆధ్వర్యంలో జరిగాయి. తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఖమ్మం క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ చేరికల్లో ముఖ్య అతిథిగా క్యాంపు కార్యాలయ ఇన్ చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి హాజరై పార్టీలోకి చేరుతున్న వారికి కాంగ్రెస్ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ,రైతులకు రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రేషన్ కార్డుల పంపిణీ, రూ. 500కే వంట గ్యాస్, ఉచిత కరెంటు వంటి అనేక సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో నిజమైన మార్పు తీసుకొస్తున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు చూసి అనేకమంది కాంగ్రెస్ వైపు ఆకర్షితులవుతున్నారని పేర్కొన్నారు. కొత్తగా చేరిన వారికి పార్టీ లో తగిన గౌరవం కల్పిస్తామని చెప్పారు. రానున్న రోజుల్లో ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్ లోకి మరిన్ని చేరికలు జరిగే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, నాయకులు కొడాలి గోవిందరావు, కోసూరి సత్యనారాయణ, నాగరాజు, మధు, బోలినేని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రసన్న గణపతి క్షేత్రంలో ఘనంగా గణనాథుని నవరాత్రి ఉత్సవాలు.!

◆ నిత్య అన్నప్రసాదం, సాంస్కృతిక వేదికలతో ఆధ్యాత్మిక శోభ.

**సత్తుపల్లి, ఆగస్టు 28 (తెలంగాణ ముచ్చట్లు):**





సత్తుపల్లి శివారులో గల ప్రసన్న గణపతి క్షేత్రంలో 23వ గణనాథుని నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా ప్రారంభమయ్యాయి. క్షేత్రం చుట్టూ వందనాలు, మంగళధ్వనులు, శంఖనాదాలతో భక్తి తరంగాలు అలలల్లాడాయి.

ఉత్సవాలను సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి ప్రారంభించగా, ఆశా స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ నిత్య అన్నప్రసాద కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్తుపల్లి ఏసీపీ రఘు సాంస్కృతిక కళావేదికను ఆవిష్కరించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనందబాబు, ప్రముఖులు చల్లగుండ్ల నరసింహారావు, గాదే చెన్నారావు, కమల్ పాష తదితరులు పాల్గొని భక్తులను ఉత్సాహపరిచారు. గణపతి విగ్రహ దాత నరుకుళ్ల కృష్ణారావు దంపతులను సత్కరించారు. భక్తుల తాకిడి ఎక్కువగా ఉండటంతో క్షేత్రం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. గణపతి మాలధారణ చేసిన భక్తులు, స్థానికులు నిత్యహారతి, భజనలతో దేవాలయ ప్రాంగణాన్ని మార్మోగించారు. ట్రస్ట్ కమిటీ సభ్యులు, నిర్వాహకులు చలసాని సాంబశివరావు, కూసంపుడి శ్రీనివాసరావు, కొత్తూరు ప్రభాకరరావు, గాది రెడ్డి రాంబాబు రెడ్డి, మందపాటి కేశవరెడ్డి, సరస్వతి, క్రాంతికుమార్, రవిరాజు, రత్నాచారి తదితరులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆధ్యాత్మికత, సాంస్కృతిక కార్యక్రమాలు, నిత్య అన్నప్రసాదంతో ప్రసన్న గణపతి క్షేత్రం భక్తజనాలకు ఉత్సాహం నింపుతూ ఉత్సవ వాతావరణంలో ముంచెత్తింది.



# మాజీ సర్పంచ్ జ్ఞాపకార్థం మేరకు విగ్రహం దాత వంశీధర్

**తెలంగాణ ముచ్చట్లు**
**జోగులాంబ గద్వాల జిల్లా**

రాజోలి మండల కేంద్రంలో వినాయక చవితి పండుగ సందర్భంగా వారి మాజీ సర్పంచ్ శ్రీ రామ్ రెడ్డి జ్ఞాపకార్థం మేరకు విగ్రహం దాత ఇచ్చినటువంటి వారు వంశీధర్ రెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి పెద్ద మసీద్ దగ్గర ఉన్నటువంటి వినాయక స్వామిని ప్రతిష్టించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా వంశీధర్ కిరణ్ కుమార్ వారు మాట్లాడుతూ “విజయ గణపతి సకల విఘ్నాలు తొలగించి విజయాలు కలిగించాలని, రాజోలి గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తున్నాను. వినాయక చవితి పండుగ శుభాకాంక్షలు రాజోలి గ్రామ ప్రజలకు, నాయకులకు, కార్యకర్తలకు, స్నేహితులకు, శ్రేయోభిలాషులకు తెలియజేస్తున్నాను” అని తెలిపారు.



# ఇందిరమ్మ ఇల్లు బేస్మెంట్ పూర్తి లబ్ధిదారుల ఖాతాలో లక్ష రూపాయలు జమ

**పెద్దమందడి,ఆగస్టు28(తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్లు పథకం కింద పెద్దమందడి మండలంలోని అల్వాల గ్రామానికి చెందిన పద్మ (భర్త: మన్నెంకొండ) బేస్మెంట్ పనులు పూర్తి చేయడంతో, సోమవారం వారి బ్యాంకు ఖాతాలో ₹1,00,000 (లక్ష రూపాయలు) జమ అయినట్లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జి. సుదర్శన్ రెడ్డి తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ - “ప్రజా ప్రభుత్వంలో, ఇందిరమ్మ రాజ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి కి ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము” అని అన్నారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు జి. సుదర్శన్ రెడ్డి, సింగిరెడ్డి బాలయ్య, మన్నెంకొండ, రాజు అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

# వినాయక మండపాలలో ప్రత్యేక పూజలు చేసిన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

**వనపర్తి,ఆగస్టు28(తెలంగాణ ముచ్చట్లు):**

వినాయక చవితి సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలోని పలు వినాయక మండపాలను మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సందర్శించారు. భక్తుల ఆహ్వానం మేరకు ఆయన గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాత మార్కెట్ (గంజ్) వెంకటేశ్వర దేవాలయం నిర్వాహకులు మాజీ మంత్రిని సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ - “విజయ గణపతి విఘ్నాలను తొలగించి విజయాలను ప్రసాదించాలని, తెలంగాణ ప్రజలు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని” ఆకాంక్షించారు. అలాగే భక్తి, ప్రబుద్ధత, ఐకమత్యంతో నిమజ్జనం వరకు పండుగ ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సూచించారు.

పండుగ సందర్భంగా పిల్లలు, యువకులు, పెద్దలు మాజీ మంత్రితో పోటీగా సెల్ఫీలు తీసుకుంటూ తమ అభిమానాన్ని చాటుకున్నారు.

ఈ కార్యక్రమంలో వాకిటి శ్రీధర్, పలుస. రమేష్ గౌడ్, మాజీ కౌన్సిలర్స్ నాగన్న యాదవ్, ఉంగ్లం తిరుమల్, తిరుమల ప్రేమ్ నాథ్ రెడ్డి, ఇమ్రాన్, శేఖర్, సునీల్ వాల్మీకి, సూర్యవంశం గిరి, చిట్యాల రాము, మంద రాము, అనుపటి రాము, మునికుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అలాగే 29వ వార్డ్ గణపతి మండపంలో మాజీ కౌన్సిలర్ భారతి ప్రేమ్ నాథ్ రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు సత్యనారాయణ రెడ్డి, మరం బాలిశ్వరయ్య, బండారు కృష్ణ, మరం బాలకృష్ణ, శ్రీనివాస్ రెడ్డి, రమణ, తిరుపతయ్య, రఘు తదితరులు పాల్గొన్నారు.



# ఖిల్లా ఘనపూర్ ఎస్సైగా వల్లూరు వెంకటేష్

**ఖిల్లా ఘనపూర్,ఆగస్టు28(తెలంగాణ ముచ్చట్లు):**

ఖిల్లా ఘనపూర్ పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా వల్లూరు వెంకటేష్ గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ రావుల గిరిధర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎస్పీ రావుల గిరిధర్ మాట్లాడుతూ, విధుల పట్ల నిర్లక్ష్యం చూపరాదని, శాంతి భద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.

జోగులాంబ గద్వాల జిల్లాలో ఎస్సైగా విధులు నిర్వహించిన వెంకటేష్, బదిలీపై ఖిల్లా ఘనపూర్‌కు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రజల సహకారంతో శాంతి భద్రతలను కాపాడేందుకు కృషి చేస్తానని, అందరూ సహకరించాలని కోరారు.




# పెద్దమందడి మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఐమాక్స్ లైట్ల ఏర్పాటు

◆ ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపిన కాలనీవాసులు

**పెద్దమందడి,ఆగస్టు27(తెలంగాణ ముచ్చట్లు):**

పెద్దమందడి మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఐమాక్స్ లైట్లు ఏర్పాటు చేయడంతో కాలనీ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. కాలనీ వాసుల వినతి మేరకు వెంటనే చర్యలు తీసుకొని లైట్లు ఏర్పాటు చేయించినందుకు స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘ రెడ్డి కి కాలనీ నివాసులు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కొమ్ము వెంకటస్వామి, మాజీ ఎంపీటీసీ బుచ్చన్న, టైలర్ రవి, కాలనీ పెద్దలు, అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు మరియు యువకులు పాల్గొన్నారు.

లైట్ల ప్రారంభోత్సవంలో మాజీ జెడ్పీటీసీ కొమ్ము వెంకటస్వామి, మాజీ ఎంపీటీసీ బుచ్చన్న, టైలర్ రవితో పాటు కాలనీ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.



తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



## ఎలిఫెంట్ చౌరస్తాలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ విగ్రహావిష్కరణ ఘనంగా

◆ **ముఖ్య అతిథులుగా ఎంపీ ఈటెల రాజేందర్, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**మల్లాపూర్, ఆగస్టు 28 (తెలంగాణ ముచ్చట్లు)**

ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని మల్లాపూర్ ఎలిఫెంట్ చౌరస్తా వద్ద సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ విగ్రహావిష్కరణ కార్యక్రమం బహుళ జనసమ్మేళనం గా జరిగింది. మల్లాపూర్, మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ గౌడ యువజన సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది.

ఈ విగ్రహావిష్కరణకు ముఖ్య అతిథులుగా మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటెల రాజేందర్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ చరిత్రను స్మరించుకుంటూ నేతలు ఆయన ధైర్యసాహసాలు, స్వాతంత్ర్య సమరంలో ఆయన పోరాటాలను ప్రస్తావించారు.నాయకుల సందేశం: నాయకులు మాట్లాడుతూ గౌడ సమాజ చరిత్రలో పాపన్న గౌడ్ మహారాజ్ విశిష్ట స్థానం సంపాదించుకున్నారని, ఆయన శౌర్యం, ప్రజా సేవా స్ఫూర్తి తరతరాలకు స్ఫూర్తినిస్తుందని అన్నారు. ఈ విగ్రహం యువతకు చరిత్రను గుర్తుచేస్తూ సామాజిక సమైక్యతను పెంపొందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేయబడిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, పంజాల శ్రవణ్ కుమార్ గౌడ్, గజ్జెల సత్యరాజ్ గౌడ్, అంబాల నారాయణ గౌడ్, కురెళ్ళ వేములయ్య గౌడ్ తదితర గౌడ యువజన సంఘ నాయకులు పాల్గొన్నారు. అలాగే వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కుల సంఘాల ప్రతినిధులు, సబ్బండ వర్గాల ప్రజలు విస్తృతంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా విగ్రహం వద్ద పుష్పగుచ్ఛాలు సమర్పించి గౌరవ నివాళులు అర్పించారు.సాంస్కృతిక ప్రదర్శనలు:కార్యక్రమం సందర్భంగా గౌడ యువజన సంఘం ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. పాపన్న గౌడ్ మహారాజ్ జీవిత చరిత్ర ఆధారంగా చిన్న నాటికలు, పాటలు, ప్రసంగాలు అందరి మనసులను హత్తుకున్నాయి. స్థానిక యువత ఉత్సాహంగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని చారిత్రాత్మకంగా నిలిపారు.

## శ్రీలంకలో మిజార్క్ అంతర్జాతీయ సదస్సు

◆ **స్టేషన్ ఘనపూర్,**

**ఆగస్టు28(తెలంగాణ ముచ్చట్లు:**





ఘనపూర్ గ్రామానికి చెందిన సింగపురం వెంకటస్వామి మిజార్క్ ఆసియా కోఆర్డినేటర్‌గా ఈ నెల 28 నుండి సెప్టెంబర్ 4 వరకు శ్రీలంకలో జరగనున్న సిఎఫ్ఎస్ యూత్ పాలసీ అంతర్జాతీయ ట్రైనింగ్ మరియు మిజార్క్ వరల్డ్ జనరల్ అసెంబ్లీలో పాల్గొంటున్నారు.

మిజార్క్ ఉద్యమం 70వ వసంతోత్సవం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న మిజార్క్ సభ్యులందరికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సదస్సులో వ్యవసాయ రంగంలో యువత పాత్ర, భవిష్యత్ దిశలో తీసుకోవలసిన చర్యలపై చర్చలు జరగనున్నాయి.

దాదాపు 10 రోజుల పాటు జరిగే ఈ సదస్సులో ఆసియా, ఆఫ్రికా, యూరోప్, లాటిన్ అమెరికా ఖండాలకు చెందిన ప్రతినిధులు పాల్గొననున్నారు. వరల్డ్ అడ్వైజర్ కుమ్మరి కృష్ణాకర్, ప్రెసిడెంట్ ఫిరోసితతో పాటు స్థానిక యువతీ యువకులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## సత్తుపల్లి–సిద్ధారం రహదారిపై వరద బీభత్సం

◆ **కిష్టారం వద్ద రాకపోకలకు అంతరాయం – పోలీసుల విజ్ఞప్తి.**

**సత్తుపల్లి, ఆగస్టు 28 (తెలంగాణ ముచ్చట్లు):**





ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో సత్తుపల్లి-సిద్ధారం గ్రామాల మధ్య రహదారి వరద ప్రవాహానికి లోనైంది. రాజీవ్ నగర్ కాలనీ సమీపంలో రహదారి చెరువును తలపించేలా నీటమునిగిపోయింది. వేంసూర్ రోడ్ నుండి గౌతం మోడల్ స్కూల్ వరకు రహదారి వరదనీటితో మునిగిపోవడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.

కిష్టారం వద్ద ట్రాఫిక్ నిలిచిపోయింది. కిష్టారం-యతాలకుంట రహదారిపై కూడా వరద ప్రభావం తీవ్రమైంది. అడవిలో నుంచి ఉధృతంగా వస్తున్న వాగులు రహదారిపైకి వచ్చి వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగిస్తున్నాయి. ముఖ్యంగా సత్తెమ్మ గుడి సమీపంలోని సవిటి వాగు పొంగిపొర్లుతూ ఉదయం నుంచి రహదారిని ముంచెత్తింది.

సత్తుపల్లి నుంచి ఖమ్మం వెళ్ళే జాతీయ రహదారిపై కిష్టారం వద్ద రోడ్డు మీదుగా రెండు అడుగులకు పైగా నీరు పారుతోంది. దీంతో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు వెళ్లడం ప్రమాదకరమని పోలీసులు ప్రకటించి రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు.



## నాగార్జుననగర్ కాలనీ లో వానరసేన యూత్స్ ఆధ్వర్యంలో భారీ గణపయ్య పూజలు

**కుషాయిగూడ, ఆగస్ట్ 28 (తెలంగాణ ముచ్చట్లు):**

ప్రతి ఒక్కరూ గణనాథుని సేవలో తరించాలని నాగార్జున నగర్ కాలనీ వానరసేన యూత్స్ నిర్వాహకులు పిలుపునిచ్చారు. ఎస్ఎన్‌సి కాలనీ రోడ్ నెంబర్ 5లో భారీ బొజ్జ గణపయ్య విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఘనంగా పూజలు నిర్వహిస్తున్నారు.

వారు మాట్లాడుతూ, గత 21 సంవత్సరాలుగా వినాయక చవితి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ వేడుకల్లో కాలనీ పెద్దలు, యువకులు అందరూ కలిసి కట్టుగా పాల్గొనడం గణనాథుని కృపవల్లేనని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో వానరసేన యూత్స్ నిర్వాహకులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## ఖిల్లా మార్కెట్ యార్డ్ పనులు పూర్తి కాకుండానే ప్రారంభం : బీఆర్ఎస్ విమర్శ

**ఖిల్లా ఘనపూర్,ఆగస్టు28(తెలంగాణ ముచ్చట్లు):**

ఖిల్లా ఘనపురం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్ పనులు పూర్తి కాకుండానే ప్రస్తుత ప్రభుత్వం ప్రారంభోత్సవం చేయడం బీఆర్ఎస్ నాయకుల ఆగ్రహానికి గురైంది. గురువారం మార్కెట్ యాడ్ ను బిఆర్ఎస్ నాయకులు సందర్శించారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో సుమారు కోటి 90 లక్షల రూపాయలతో మార్కెట్ యార్డ్ నిర్మాణం ప్రారంభమై ఏడాదిన్నర కాలంలో పురోగతి సాధించినా ఇంకా అనేక పనులు మిగిలి ఉన్నాయని మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య, మాజీ ఎంపీపీ కృష్ణ నాయక్ తెలిపారు.

ప్రభుత్వం ఎన్నికల దృష్ట్యా ఆగమోఘాలపై ప్రారంభోత్సవాలు చేస్తోందని వారు విమర్శించారు. కనీస సౌకర్యాలు లేని పరిస్థితిలో మార్కెట్ యార్డ్ ప్రారంభం ప్రజలను మోసం చేయడమేనని పేర్కొన్నారు. షెడ్ల మధ్య గోడలు, కోతుల బెడదను నివారించే జాలీలు వంటి అవసరాలు ఇప్పటికీ అందుబాటులో లేవని చిన్న వ్యాపారులు తెలిపారు.

రైతులు యూరియా బస్తాల కోసం పడిగాపులు కాస్తున్నా ప్రభుత్వం దృష్టి పెట్టకపోవడం విచారకరమని నాయకులు మండిపడ్డారు. వాలాద్రి వాగుపై గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన బ్రిడ్జి ప్రారంభోత్సవం చేసేందుకు మాత్రమే కాంగ్రెస్ శ్రద్ధ చూపుతోందని, కొత్త అభివృద్ధి పనులపై చిత్తశుద్ధి కనిపించడం లేదని వ్యాఖ్యానించారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కృష్ణా నాయక్, మాజీ జెడ్పిటిసి సామ్యా నాయక్, మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య, మాజీ సర్పంచ్ మన్యం గౌడ్, సురేందర్, గ్రామ అధ్యక్షుడు బాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గణేశుడి ఆశీస్సులతో సర్వ సుఖాలు కలగాలి

◆ **పెద్దమందడి మాజీ ఎంపీపీ రఘు ప్రసాద్**

**పెద్దమందడి,ఆగస్టు28(తెలంగాణ ముచ్చట్లు):**



రాష్ట్ర ప్రజలకు అంతా మంచే జరగాలని, ప్రతి కుటుంబం ఆనందం, ఆరోగ్యం, అభివృద్ధితో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నానని పెద్దమందడి మాజీ ఎంపీపీ తమ్మల రఘుప్రసాద్ వినాయక చవితి సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

వినాయకుని ఆశీస్సులతో ప్రజల కష్టాలు తొలగిపోవాలని, జీవితాల్లో సంతోషాలు వెల్లివిరియాలని, ప్రతి ఒక్కరి లక్ష్యాలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా గణపతి అనుగ్రహించాలని కోరుతున్నానని ఆయన పేర్కొన్నారు. వాడవాడలా మండపాలు నెలకొల్పి భక్తిశ్రద్ధలతో గణేశ్ నవరాత్రి వేడుకలు జరుపుకుంటున్న ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సకల శుభాలు కలగాలని మనసారా గణేశుని ప్రార్థిస్తున్నానని తమ్మల రఘుప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

## సేవలు చిరస్మరణీయమే ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పదు ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**కీసర, ఆగస్ట్ 28 (తెలంగాణ ముచ్చట్లు)**



ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, ప్రతి ఉద్యోగి పదవీ విరమణ ఒక సహజ ప్రక్రియ. కానీ ఉద్యోగం చేస్తున్న సమయంలో మనం చూపిన కృషి, కట్టుబాటు ఎప్పటికీ మరిచిపోలేనిది. మనం వెళ్ళిపోయినా మన సేవలు సమాజంలో గుర్తుండిపోతాయి" అన్నారు.కీసర మండలం చిర్యాల ఎక్స్ రోడ్ వద్ద గల జయ మోహన్ ఫంక్షన్ హాల్లో బుధవారం జరిగిన నంది సుధాకర్ రెడ్డి పదవీ విరమణ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ,సుధాకర్ రెడ్డి ఉపాధ్యాయుడిగా తన వృత్తి జీవితమంతా సమాజానికి సేవ చేశారు. ఎన్నో తరాలను తీర్చిదిద్దారు. విద్యార్థుల భవిష్యత్తును మెరుగుపరిచే దిశగా ఆయన కృషి ఎంతో విలువైనది. ఒక ఉపాధ్యాయుడి కృషి సమాజంపై ఎంతటి ప్రభావం చూపుతుందో ఆయన జీవితమే సాక్ష్యం. ఆయన చూపిన నిబద్ధత కొత్త తరాలకి ఆదర్శం" అని అన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు గంధం నాగేశ్వర్ రావు, నేమూరీ మహేష్ గౌడ్, కుమార స్వామి తదితరులు పాల్గొని సుధాకర్ రెడ్డి గారిపై ప్రశంసల వర్షం కురిపించారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు, విద్యార్థులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఆయనకు సన్మానం చేశారు.

కార్యక్రమం ముగింపు సందర్భంగా సుధాకర్ రెడ్డి తన అనుభవాలను పంచుకొని అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ, "ఉపాధ్యాయ వృత్తి నా ప్రాణం. నా జీవితంలో ఇది గొప్ప గౌరవ క్షణం. సమాజానికి ఉపాధ్యాయునిగా సేవ చేసే అవకాశం రావడం నాకు గర్వ కారణం" అని భావోద్వేగంగా మాట్లాడారు.

## సింగరేణి గనుల్లో వరద బీభత్సం

◆ **భారీ వర్షా నికి జేవీఆర్, కిష్టారం ఓపెన్ కాస్ట్‌లలో బొగ్గు ఉత్పత్తి పూర్తిగా నిలిచింది.**

**సత్తుపల్లి, ఆగస్టు 28 (తెలంగాణ ముచ్చట్లు):**



ఖమ్మం జిల్లా సత్తుపల్లి డివిజన్ వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షం సింగరేణి బొగ్గు గనులను ముంచెత్తింది. జేవీఆర్, కిష్టారం ఓపెన్ కాస్ట్ గనుల్లో వర్షపు నీరు చేరడంతో బొగ్గు ఉత్పత్తి పూర్తిగా ఆగిపోయింది.

జేవీఆర్ ఓసీలో రోజుకు ఉత్పత్తి అయ్యే 30 వేల టన్నుల బొగ్గు, 1.60 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తొలగింపు పనులు నిలిచిపోయాయి. అదే విధంగా కిష్టారం ఓసీలో 10 వేల టన్నుల బొగ్గు, 55 వేల క్యూబిక్ మీటర్ల మట్టి తొలగింపు పనులు ఆగిపోయాయి.

వరద నీరు నిల్వ ఉండటంతో గనుల ఉపరితలం చిత్తడిగా మారి వాహనాలు కదలలేని పరిస్థితి ఏర్పడింది. నిలిచిన నీటిని మోటర్ల సహాయంతో బయటకు పంపిస్తున్నామని, పరిస్థితులు చక్కబడిన వెంటనే ఉత్పత్తి పనులు పునః ప్రారంభిస్తామని సింగరేణి అధికారులు తెలిపారు.

## వినాయక పూజలో పాల్గొన్న సాయి చరణ్ రెడ్డి

**వనపర్తి,ఆగస్టు 27 (తెలంగాణ ముచ్చట్లు):**

ఖిల్లా ఘనపూర్ మండల కేంద్రంలోని సలీకేలాపూర్ గ్రామంలో సాక్షి గణపతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక చవితి తొలి పూజా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వనపర్తి కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు టీ. సాయి చరణ్ రెడ్డి పాల్గొని గణపతికి ప్రత్యేక పూజలు చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ –

"విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, పాడిపంటలతో ఆనందంగా ఉండాలని భగవంతుని ప్రార్థిస్తున్నాను. అందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు" అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సాక్షి గణపతి యూత్ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు, భక్తులు పాల్గొన్నారు.



# పండ్లు తిన్న వెంటనే నీళ్లు తాగుతున్నారా..?

సీజన్స్ బట్టి రకరకాల పండ్లు మార్కెట్లో లభిస్తాయి. విటమిన్లు, కాల్షియం, ఐరన్, పొటాషియం వంటి అనేక పోషకాలను పండ్లు మన శరీరానికి అందిస్తాయి. అయితే, పండ్లు తిన్న తర్వాత చాలా మంది చేసే ఒక సాధారణ పొరపాటు పండ్లను తిన్న వెంటనే నీరు తాగడం. ఇది ఆరోగ్యానికి మంచిది కాదని నిపుణులు చెబుతున్నారు. జీర్ణ సమస్యలు: పండ్లు తిన్న వెంటనే నీరు తాగడం వల్ల జీర్ణక్రియ నెమ్మదిస్తుంది. దీనివల్ల అజీర్ణం, ఆమ్లత్వం, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు తలెత్తుతాయి. దీన్ని వల్ల శరీరం పండ్ల నుండి పోషకాలను సరిగ్గా గ్రహించకపోవడంతో పూర్తి ప్రయోజనాలు అందవు. ముఖ్యంగా పుల్లని పండ్ల విషయంలో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంటుంది. పండ్లు తిన్న తర్వాత నీరు తాగడం వల్ల శరీరంలో నీటి శాతం పెరుగుతుంది. దీనివల్ల శరీర జూన స్థాయిలు తగ్గుతాయి. కొన్ని పండ్లలో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. అటువంటి పండ్లను తిన్న తర్వాత నీరు తాగితే, నీటి శాతం మరింత పెరిగి కొందరిలో వాంతులు అయ్యే అవకాశం కూడా ఉంటుంది. రక్తంలో చక్కెర పెరగడం : పండ్లు తిన్న వెంటనే నీరు తాగడం వల్ల జీర్ణక్రియ మందగించి శరీరంలో



గ్లూకోజ్ స్థాయిలు పెరుగుతాయి. ఇది మధుమేహం ఉన్నవారికి లేదా మధుమేహం వచ్చే ప్రమాదం ఉన్నవారికి ప్రమాదకరం. కాబట్టి, మధుమేహ వ్యాధిగ్రస్తులు పండ్లు తిన్న వెంటనే నీరు తాగకూడదు. జలుబు, దగ్గు సమస్యలు: పండ్లను తిన్న వెంటనే నీళ్లు తాగితే శరీరంలో కఫం పెరుగుతుంది. దీనివల్ల దగ్గు, జలుబు, గొంతు నొప్పి వంటి సమస్యలు వస్తాయి. ఈ విషయాన్ని మన పెద్దలు కూడా తరచుగా చెబుతూ ఉంటారు. కాబట్టి, పండ్లను భోజనానికి అరగంట ముందు లేదా అరగంట తర్వాత తినడం ఉత్తమం, అంతేకాకుండా పండ్లు తిన్న వెంటనే నీరు తాగడం మానుకోవాలి.

# ఖాళీ కడుపుతో టీ లేదా కాఫీ తాగితే ప్రమాదమా?

తరచుగా చాలా మంది తమ ఉదయం ఒక కప్పు వేడి టీ లేదా కాఫీతో ప్రారంభిస్తారు. ఇది రోజు అలసట నుండి ఉపశమనం పొందే మార్గంగా మారింది. కొంతమందికి ఇది ఎప్పటికీ వదిలివేయలేని అలవాటుగా మారిపోయింది. కానీ, మీరు రోజూ ఖాళీ కడుపుతో వేడి టీ లేదా కాఫీ తాగితే, ఈ అలవాటు మీకు ప్రమాదకరమని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఖాళీ కడుపుతో వేడి పానీయాలు తాగడం వల్ల అన్నవాహిక క్యాన్సర్ వచ్చే ప్రమాదం చాలా రెట్లు పెరుగుతుందని శాస్త్రవేత్తల పరిశోధనలో వెల్లడైంది. ఈ పరిశోధనలో, వేడి చేసిన టీ లేదా కాఫీ వంటి చాలా వేడి పానీయాలు, ప్రతిరోజూ ఎక్కువసేపు తీసుకుంటే, ఆహార పైపులోని కణాలను దెబ్బతీస్తుందని కనుగొన్నారు. పదే పదే వేడికి గురికావడం వల్ల ఈ కణాలు క్రమంగా దెబ్బతింటాయి. ఆ తరువాత క్యాన్సర్ రూపంలోకి మారవచ్చు. ఖఖ బయోబ్యాంక్ ఈ అధ్యయనంలో ఇది వెల్లడైంది. సుమారు 5 లక్షల మందిపై పరిశోధన జరిగింది. ఈ పరిశోధనకు నేషనల్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అమెరికా మద్దతు కూడా లభించింది. రోజుకు 8 నుండి 10 కప్పుల వేడి పానీయాలు తాగేవారికి ఎసోఫాగియల్ స్క్వామస్ సెల్ కార్సినోమా అనే క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉందని చెబుతున్నారు. మీరు ఎంత ఎక్కువ వేడి పానీయాలు తాగితే, ప్రమాదం కూడా అంత ఎక్కువగా ఉంటుందని పరిశోధన స్పష్టం చేసింది. దీనివల్ల ఆహార పైపులో వాపు వస్తుంది. అక్కడి కణజాలాలు విచ్ఛిన్నం కావడం ప్రారంభమవుతుంది, ఇది క్యాన్సర్ ప్రమాదాన్ని దారితీస్తుంది. గొంతు, కడుపు మధ్య ఉన్న గొట్టంలో అన్నవాహిక క్యాన్సర్ సంభవిస్తుంది. దీని ద్వారా మన ఆహారం, పానీయాలు కడుపుకు చేరుకుంటాయి. ఈ గొట్టం చాలా సున్నితమైనది. వేడిగా ఉండే వస్తువులు నేరుగా దానిని దెబ్బతీస్తాయి. ఈ నష్టం చాలా కాలం పాటు కొనసాగితే, అక్కడి కణాలు అసాధారణంగా పెరగడం ప్రారంభిస్తాయి. అదీ క్యాన్సర్ ఏర్పడటం ప్రారంభమవుతుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అన్నవాహిక క్యాన్సర్ ప్రారంభ లక్షణాలు కనిపించవు. ఈ క్యాన్సర్‌తో అతిపెద్ద సమస్య ఏమిటంటే దాని లక్షణాలు ప్రారంభంలో కనిపించవు. తరచుగా ప్రజలు దీనిని గుండెల్లో మంట, ఆమ్లత్వం లేదా దగ్గు అని భావించి విస్మరిస్తారు. సరైన గుర్తింపు జరిగే సమయానికి, ఈ వ్యాధి తీవ్రమైన రూపాన్ని సంతరించుకుంటుందని వైద్యులు చెబుతున్నారు. ఫుడ్ పైప్ క్యాన్సర్ కొన్ని ప్రధాన లక్షణాలు ఆహారాన్ని మింగడంలో ఇబ్బంది, ఛాతీలో నొప్పి లేదా ఒత్తిడి అనుభూతి, తరచుగా దగ్గు, స్వరంలో మార్పు. దీనిని నివారించడానికి సులభమైన మార్గం ఏమిటంటే, కొద్దిగా చల్లబరిచిన తర్వాత టీ లేదా కాఫీ తాగాలని వైద్యులు సూచిస్తున్నారు.



# కాటన్ బడ్స్‌తో చెవులు క్లీన్ చేస్తున్నారా..?

మన చెవులను శుభ్రం చేసుకోవడానికి మనం సాధారణంగా వాడే ఇయర్‌బడ్స్, అగ్గిపుల్లలు, పిన్నులు లేదా ఇతర వస్తువులు ఎంతో ప్రమాదకరమని మీకు తెలుసా? ఈ అలవాటు మన వినికిడి శక్తిని దెబ్బతీయడంతో పాటు చెవి ఇన్ఫెక్షన్లకు కూడా కారణమవుతుంది. చాలా మందికి తెలియని విషయం ఏమిటంటే, చెవిలో ఉండే ఇయర్‌వాక్స్ నిజానికి మన ఆరోగ్యానికి చాలా ముఖ్యం. ఇది చెవులను రక్షించే సహజ రక్షణ కవచం. సాధారణంగా చెవిలో పేరుకుపోయే ఇయర్‌వాక్స్‌ను చాలామంది మురికిగా భావిస్తారు. కానీ అది నిజం కాదు. ఇయర్‌వాక్స్ అనేది రెండు రకాల గ్రంథుల ద్వారా ఉత్పత్తి అయ్యే ఒక రక్షణ పదార్థం. ఇది చెవిలోపలి భాగాన్ని దుమ్ము, ధూళి, బ్యాక్టీరియా నుండి రక్షిస్తుంది. అలాగే చెవి లోపలి భాగాన్ని పొడిబారకుండా కాపాడుతుంది. ఇయర్‌బడ్స్‌ను చెవిలో లోపలికి తోసినప్పుడు.. అవి చెవిలోపలి సున్నితమైన చర్మాన్ని దెబ్బతీస్తాయి. అంతేకాకుండా లోపలికి నెట్టినప్పుడు, అవి ఇయర్‌వాక్స్‌ను మరింత లోపలికి నెట్టేస్తాయి. దీనివల్ల ఇయర్‌వాక్స్ బయటకు రాకుండా గట్టిపడి, చెవిలో నొప్పి లేదా వినికిడి లోపానికి దారితీస్తుంది.ఇన్ఫెక్షన్‌కు కారణం: ఇయర్‌బడ్స్ వాడినప్పుడు బయట ఉన్న బ్యాక్టీరియా చెవిలోకి ప్రవేశించి, సున్నితమైన చర్మానికి గాయాలు చేసి ఇన్ఫెక్షన్‌కు దారితీస్తుంది. ఈ ఇన్ఫెక్షన్ వల్ల తీవ్రమైన నొప్పి, దురద, చెడు వాసన కూడా రావచ్చు. వినికిడి లోపం: ఇయర్‌వాక్స్ గట్టిపడినప్పుడు అది శబ్ద తరంగాలను కర్ణభేరికి చేరకుండా అడ్డుకుంటుంది. దీనివల్ల తాత్కాలికంగా లేదా శాశ్వతంగా వినికిడి లోపం వచ్చే ప్రమాదం ఉంటుంది. మన చెవులు



వాటంతటవే శుభ్రం చేసుకునే సామర్థ్యం కలిగి ఉంటాయి. చాలా సందర్భాలలో ఇయర్‌వాక్స్ సహజంగానే బయటకు వచ్చేస్తుంది. మీకు చెవిలో నొప్పి, దురద, లేదా వినికిడిలో ఏమైనా ఇబ్బంది ఉంటే వెంటనే స్వీయ చికిత్స మానేసి వైద్యుడిని సంప్రదించడం మంచిది. వైద్యులు మాత్రమే సురక్షితమైన పద్ధతులతో ఇయర్‌వాక్స్‌ను తొలగించగలరు. గుర్తుంచుకోండి, మన ఆరోగ్యం పట్ల మనం జాగ్రత్తగా ఉండాలి. చెవుల విషయంలో ఎప్పుడూ నిర్లక్ష్యం చేయకూడదు.

# కొలెస్ట్రాల్‌కు చెక్‌పెట్టే దివ్యౌషధం..

పని ఒత్తిడి, తప్పుడు ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడం వల్ల, ప్రజలు క్రమంగా వ్యాధుల బారిన పడుతున్నారు. ముఖ్యంగా గుండె సంబంధిత సమస్యలు వేగంగా పెరుగుతున్నాయి.. దీనికి ప్రధాన కారణం శరీరంలో కొలెస్ట్రాల్ పెరుగుదల.. కొలెస్ట్రాల్ అనేది శరీరంలో తక్కువ పరిమాణంలో అవసరమైన కొవ్వు రకం.. కానీ అది అవసరమైన దానికంటే ఎక్కువగా పెరిగినప్పుడు, అది గుండె నాళాలలో పేరుకుపోయి రక్త ప్రవాహంలో అడ్డంకిని కలిగిస్తుంది.. ఇది గుండెపోటు ప్రమాదాన్ని పెంచుతుంది. అటువంటి పరిస్థితిలో, కొలెస్ట్రాల్‌ను నియంత్రణలో ఉంచుకోవడం చాలా ముఖ్యం. మందులతో పాటు, కొన్ని సహజ వస్తువులు కూడా దీనికి సహాయపడతాయి..



అమెరికన్ నేషనల్ లైబ్రరీ ఆఫ్ మెడిసిన్ ప్రకారం.. గుమ్మడికాయ గింజలు చాలా ఫైబర్‌ను కలిగి ఉంటాయి.. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ప్రేగులలో కొలెస్ట్రాల్ శోషణను తగ్గిస్తుంది. దీనితో పాటు, గుమ్మడికాయ గింజలలో ఉండే కొవ్వులు, అంటే ఒమేగా 3, ఒమేగా 6 కొవ్వు ఆమ్లాలు వంటి ఆరోగ్యకరమైన కొవ్వులు, మీ రక్తంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడానికి, మంచి కొలెస్ట్రాల్‌ను పెంచడానికి పనిచేస్తాయి. అలాగే, అవి ఫైటోస్టెరాల్స్ అని పిలువబడే సహజ మూలకాలను కలిగి ఉంటాయి. ఇవి శరీరంలో కొలెస్ట్రాల్ శోషణను నిరోధిస్తాయి. దీని ప్రయోజనం ఏమిటంటే రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయి స్వయంచాలకంగా తగ్గడం ప్రారంభమవుతుంది.. ఇది గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. గుమ్మడికాయ గింజలు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో మాత్రమే కాకుండా, మొత్తం గుండె ఆరోగ్యానికి కూడా ప్రయోజనకరంగా ఉంటాయి. వాటిలో మెగ్నీషియం అనే మూలకం ఉంటుంది, ఇది రక్త నాళాలను సడలించి రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. అలాగే, గుమ్మడికాయ గింజలు యాంటీఆక్సిడెంట్‌లను కలిగి ఉంటాయి. ఇవి శరీరంలో మంటను తగ్గిస్తాయి.. ఇంకా గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. దీనితో పాటు, ఈ విత్తనాలు మానసిక ఆరోగ్యానికి కూడా మంచివిగా భావిస్తారు. గుమ్మడికాయ గింజల్లో ట్రిప్టోఫాన్ అనే అమైనో ఆమ్లం ఉంటుంది. ఇది శరీరంలోకి వెళ్లి సెరోటోనిన్ అనే రసాయనంగా మారుతుంది. సెరోటోనిన్ మంచి నిద్రను పొందడంలో సహాయపడుతుంది. ఒత్తిడిని కూడా తగ్గిస్తుంది. గుమ్మడికాయ గింజల్లో జింక్ కూడా ఉంటుంది. ఇది మన రోగనిరోధక శక్తిని అంటే రోగనిరోధక వ్యవస్థను బలపరుస్తుంది. ఇది శరీరాన్ని వ్యాధులతో పోరాడటానికి వీలు కల్పిస్తుంది. ఈ విత్తనాలు పురుషులకు ముఖ్యంగా ప్రయోజనకరంగా ఉంటాయి. ఎందుకంటే వాటిలో ఉండే జింక్.. ఇతర పోషకాలు ప్రోస్టేట్ గ్రంథిని జాగ్రత్తగా చూసుకుంటాయి. ఇది ప్రోస్టేట్ వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. గుమ్మడికాయ గింజల్లో విటమిన్ %జు%, కెరోటినాయిడ్స్ వంటి శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు కూడా ఉంటాయి. ఇవి శరీర కణాలను దెబ్బతీసే ఫ్రీ రాడికల్స్ నుండి రక్షిస్తాయి. ఇది మన శరీరం వృద్ధాప్య ప్రక్రియను కూడా నెమ్మదిస్తుంది.గుమ్మడికాయ గింజలను తినడానికి మార్గం కూడా చాలా సులభం. మీరు వాటిని తేలికగా కాల్చి అల్పాహారంలో నేరుగా తినవచ్చు.. లేదా సలాడ్, పెరుగు, స్మూతీ మొదలైన వాటిలో చేర్చుకోవచ్చు.. అయితే.. గుమ్మడికాయ గింజలను పరిమిత పరిమాణంలో తినాలని గుర్తుంచుకోండి.. ఎందుకంటే ఎక్కువగా తినడం హానికరం. రోజుకు 20 నుండి 30 గ్రాములు అంటే గుప్పెడు గుమ్మడికాయ గింజలు తినడం శరీరానికి సరిపోతుంది. మీ దినచర్యలో క్రమం తప్పకుండా వీటిని చేర్చుకుంటే, క్రమంగా మీ కొలెస్ట్రాల్ సమతుల్యమవుతుంది.. ఇంకా మీ గుండె ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. ఈ విధంగా, గుమ్మడికాయ గింజలు చౌకైన.. సహజ నివారణ.. ఇది మీ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. కొలెస్ట్రాల్‌ను నియంత్రించడమే కాకుండా మీ మొత్తం శరీరాన్ని లోపలి నుండి బలోపేతం చేస్తుంది. కాబట్టి, ఈరోజే మీ ఆహారంలో గుమ్మడికాయ గింజలను చేర్చుకోండి.. ఆరోగ్యకరమైన జీవితం వైపు అడుగు వేయండి.

# జామ ఆకులు తింటే..


జామ పండు ఎంత రుచికరంగా ఉంటుందో.. దాని ఆకులు కూడా అంతే ఆరోగ్యకరమని నిపుణులు చెబుతున్నారు. జామ ఆకుల్లో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ సి, పొటాషియం, లైకోపీన్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఈ పోషకాల కారణంగా జామ ఆకు రసం ప్రతిరోజూ తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. అజీర్ణంతో బాధపడేవారికి జామ ఆకు రసం ఒక దివ్యౌషధంలా పనిచేస్తుంది. ఇందులో ఉండే ఫైబర్, యాంటీబ్యాక్టీరియల్ లక్షణాలు జీర్ణ సమస్యలను తగ్గించడంలో సహాయపడతాయి. మలబద్ధకం సమస్య ఉన్నవారు జామ ఆకు జ్యూస్ తీసుకోవడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయి. అలాగే జ్వరం వచ్చినప్పుడు జామ ఆకు రసాన్ని ఒక చెంచా మరిగించి తాగితే జ్వరం త్వరగా తగ్గుతుంది. జామ ఆకు రసం తీసుకోవడం వల్ల మన శరీరంలో రోగనిరోధక శక్తి గణనీయంగా పెరుగుతుంది. ఇందులో అధికంగా ఉండే విటమిన్ సి శరీరం బ్యాక్టీరియాతో పోరాడటానికి సహాయపడుతుంది. ఇది ఆరోగ్య సమస్యలను నివారించి, శరీరాన్ని మరింత



పటిష్టం చేస్తుంది. చర్మం, జుట్టు సమస్యలతో బాధపడేవారికి కూడా జామ ఆకు రసం మంచి పరిష్కారం. దీనిలో ఉండే విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు చర్మానికి సహజమైన కాంతిని ఇవ్వడమే కాకుండా జుట్టు పెరుగుదలను కూడా ప్రోత్సహిస్తాయి. జామ ఆకు రసం తాగడం వల్ల శరీరంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గి, మంచి కొలెస్ట్రాల్ స్థాయిలు పెరుగుతాయి. ఇది గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడం ద్వారా గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అంతేకాకుండా డయాబెటిస్ ఉన్నవారికి కూడా ఇది ఎంతో ఉపయోగపడుతుంది. జామ ఆకులలో ఉండే పాలీఫెనాల్స్ రక్తంలో కార్బోహైడ్రేట్ల శోషణను నియంత్రించి, రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతాయి. ఈ ఆరోగ్య ప్రయోజనాలను పొందాలంటే జామ ఆకులను శుభ్రం చేసి, నీటిలో వేసి మరిగించి ఆ రసాన్ని తాగవచ్చు. అయితే, ఏదైనా ఆరోగ్య సమస్య ఉన్నవారు వైద్య నిపుణులను సంప్రదించి సలహా తీసుకోవడం మంచిది.

# కొబ్బరి బోండం నీళ్లు వీరికి విషంతో సమానం..

కొబ్బరి నీళ్లు తాగడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుంది. కొబ్బరి నీళ్లు తాగడం వల్ల తక్షణ శక్తి లభిస్తుంది. అంతేకాకుండా ఈ నీళ్లలో శరీరానికి మేలు చేసే అనేక ముఖ్యమైన పోషకాలు కూడా ఉన్నాయి. అయితే కొంతమందికి కొబ్బరి నీళ్లు తాగడం చాలా ప్రమాదకరమని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ముఖ్యంగా కొన్ని రకాల ఆరోగ్య సమస్యలు ఉన్నవారు కొబ్బరి నీళ్లు తాగడం వల్ల తీవ్ర పరిణామాలు ఎదుర్కోవల్సి ఉంటుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. కొబ్బరి నీళ్లలో పెద్ద మొత్తంలో పొటాషియం ఉంటుంది. కాబట్టి ఎవరికైనా కిడ్నీ సంబంధిత వ్యాధులు ఉంటే.. ఇలాంటి వారు కొబ్బరి నీళ్లు తాగడం మానేయాలి. ఇది హైపర్ కలేమియాకు కారణమవుతుంది. అందుకే కిడ్నీ సంబంధిత వ్యాధులు ఉన్నవారు కొబ్బరి నీళ్లు తాగకుండా ఉండాలి.కొబ్బరి నీళ్లు రక్తపోటును తగ్గించడంలో సహాయపడతాయి. అయితే తక్కువ రక్తపోటు సమస్య ఉన్నవారు కొబ్బరి నీళ్లు తాగకూడదు. కొబ్బరి నీళ్లు తాగితే బలహీనత, తలతిరుగుతున్నట్లు అనిపించే అవకాశం ఉంది. శస్త్రచికిత్స సమయంలో శరీర రక్తపోటును సమతుల్యంగా ఉంచడం



ముఖ్యం. అందుకే శస్త్రచికిత్సకు ముందు, ఆ తరువాత కొబ్బరి నీళ్లు తాగే ముందు ఒకటికి పదిసార్లు ఆలోచించడం అవసరం. కాబట్టి ఏదైనా ఆరోగ్య సమస్యలు ఉన్నవారు డాక్టర్ సలహా మేరకు కొబ్బరి నీళ్లు తాగడం మంచిది.

శుక్రవారం-29- ఆగస్టు 2025

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# వేయి స్తంభాల ఆలయంలో వినాయక చవితి వేడుకల్లో పాల్గొన్న ఎంపీ కడియం కావ్య

- వేయి స్తంభాల ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా
- త్వరలో కేంద్ర మంత్రిని కలుస్తా
- సీఎం రేవంత్ రెడ్డి పాలనలో వరంగల్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోంది

**హన్మకొండ,ఆగస్టు27(తెలంగాణ ముచ్చట్లు):**

హన్మకొండలోని చారిత్రక వేయి స్తంభాల ఆలయంలో వినాయక చవితి వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించబడ్డాయి. ఈ వేడుకలకు వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య, స్థానిక శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి చేరుకున్న ఎంపీకి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ ప్రాంగణం మొత్తం "గణపతి బప్పా మోరియా" నినాదాలతో మార్మోగింది.



ఈ సందర్భంగా ఎంపీ మీడియాతో మాట్లాడుతూ ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల అభ్యున్నతికి ఎలాంటి విఘ్నాలు లేకుండా గణపతి ఆశీర్వదించాలని కోరుకున్నట్లు తెలిపారు. చారిత్రక వేయి స్తంభాల ఆలయ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. త్వరలో కేంద్ర మంత్రిని కలిసి నిధుల మంజూరుపై విజ్ఞప్తి చేస్తానని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో వరంగల్ వేగంగా అభివృద్ధి చెందుతోందని, రాష్ట్ర-కేంద్ర ప్రభుత్వాల సమన్వయంతో ఆలయాలు, పర్యాటక ప్రదేశాలు, రహదారులు, విద్యా-వైద్య రంగాల్లో మరింత పురోగతి సాధించేందుకు కృషి చేస్తానని తెలిపారు. తరువాత నిర్వహించిన గణపతి పల్లకి సేవలో ఎంపీ కావ్య స్వయంగా పల్లకి మోసి సేవ చేశారు. అనంతరం అర్చకులు వేద ఆశీర్వచనాలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# మాజీ సర్పంచ్ జ్ఞాపకార్థం మేరకు విగ్రహం దాత వంశీధర్

**తెలంగాణ ముచ్చట్లు జోగులాంబ గద్వాల జిల్లా**

రాజోలి మండల కేంద్రంలో వినాయక చవితి పండుగ సందర్భంగా వారి మాజీ సర్పంచ్ శ్రీ రామ్ రెడ్డి జ్ఞాపకార్థం మేరకు విగ్రహం దాత ఇచ్చినటువంటి వారు వంశీధర్ రెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి పెద్ద మసీద్ దగ్గర ఉన్నటువంటి వినాయక స్వామిని ప్రతిష్టించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.
ఈ సందర్భంగా వంశీధర్ కిరణ్ కుమార్ వారు మాట్లాడుతూ
"విజయ గణపతి సకల విఘ్నాలు తొలగించి విజయాలు కలిగించాలని, రాజోలి గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తున్నాను. వినాయక చవితి పండుగ శుభాకాంక్షలు రాజోలి గ్రామ ప్రజలకు, నాయకులకు, కార్యకర్తలకు, స్నేహితులకు, శ్రేయోభిలాషులకు తెలియజేస్తున్నాను" అని తెలిపారు.



# సంజీవనిలా 108 వాహనాలు

- దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటున్న 108 సేవలు
- అత్యవసర సమయాల్లో తక్షణ చికిత్స సహాయం
- అంబులెన్స్ లోనే అందుతున్న ప్రథమచికిత్స
- అందుబాటులో ఉన్న ఆధునిక వైద్య పరికరాలు

**మహబూబాబాద్,ఆగస్టు27 (తెలంగాణ ముచ్చట్లు):**




దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన 108 అంబులెన్స్ పథకం దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటోంది. ప్రమాదంలో ఉన్న వారికి సంజీవనిలా ఈ అంబులెన్స్ లు మారాయి. ప్రజలకు ఎలాంటి ఆపద వచ్చినా మొదట గుర్తొచ్చేది 108 నంబరే. అత్యవసర సమయాల్లో తక్షణ చికిత్స అందించడంతో పాటు, సకాలంలో క్షతగాత్రులు, రోగులను ఆస్పత్రులకు తరలించడమే దీనికి గల ప్రధాన కారణం. ప్రస్తుతం దేశంలోని అనేక రాష్ట్రాల్లో ఈ పథకం విజయవంతంగా అమలవుతోంది. 108 అంబులెన్స్ వాహనంలో శిక్షణ పొందిన ఈఎంటీ (ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్), పైలట్ లు అందుబాటులో ఉంటారు. వీరు రోగులు, క్షతగాత్రులను సకాలంలో ఆస్పత్రులకు చేర్చడంతో పాటు, వాహనంలోనే ప్రథమ చికిత్స అందిస్తారు. గుండె నొప్పి వస్తే ఉపయోగించే ఏఈడీ పరికరం, అవసరమైన మందులు, ఆక్సిజన్ పరికరాలు, ఆక్సీమీటర్, పురుగు మందు తాగితే వాంతి చేయించే యంత్రం వంటివి వాహనంలో సిద్ధంగా ఉంటాయి. ఆస్పత్రులకు తరలించే క్రమంలోనే గర్భిణులకు సుఖ ప్రసవాలు చేసిన ఘటనలు అనేకం ఉన్నాయి.

**అందుబాటులో 21 అంబులెన్స్ లు...**

మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా 20 అంబులెన్స్ వాహనాలు, ఒక నియోనాటల్ అంబులెన్స్ అందుబాటులో ఉన్నాయి..దీనికి గాను అట్టి వాహనాల్లో 40 మంది. ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్స్, 40 మంది పైలట్లు అందుబాటులో ఉంటూ ఒక్కో వాహనం నిత్యం నాలుగు నుంచి ఐదు ట్రిప్పులు చేస్తూ ఘటనా స్థలం నుంచి బాధితులను ఆస్పత్రులకు తరలిస్తున్నారు. ప్రతీ నెల ఒక్కో వాహనం దాదాపు 150 నుంచి 180 మందికి సేవలను అందిస్తోంది.

### అంబులెన్స్ ల సేవలను వినియోగించుకోవాలి...



108 అంబులెన్స్ లలో శిక్షణ పొందిన మెడికల్ టెక్నీషియన్ తో పాటు సమర్థుడైన పైలట్ అందుబాటులో ఉంటారు. ఘటనస్థలి నుంచి అంబులెన్స్ కు ఫోన్ వచ్చిన వెంటనే మా సిబ్బంది వెళ్లి క్షతగాత్రులను అంబులెన్స్ లోకి తీసుకొని తక్షణమే ప్రథమ చికిత్సను ఆరంభించి వారి ఆరోగ్య పరిస్థితి క్షీణించకుండా వైద్యసేవలు అందించడం జరుగుతుంది. మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రజలందరూ 108 సేవలను వినియోగించుకోవాలి.

**-పాటి శివకుమార్ (ప్రోగ్రామ్ మేనేజర్)**

### నిత్యం అంబులెన్స్ ల తనిఖీలు చేస్తాం



జిల్లాలో ఉన్న అన్ని 108 అంబులెన్స్ వాహనాలను నిత్యం క్షేత్రస్థాయిలో తనిఖీలు చేస్తుంటాం. అత్యవసర సేవలు అందించేలా మందులు, పరికరాలు అందుబాటులో ఉంచుతాం. సమాచారం అందిన వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని, ఆస్పత్రులకు తరలించే లోపు వాహనంలోనే ప్రథమ చికిత్స అందించి ప్రాణాలు కాపాడటమే విధిగా సేవలను అందిస్తున్నాం.

**-బత్తిని మహేష్ (జిల్లా మేనేజర్)**

# టీవీఎస్ కొత్త ఎలక్ట్రిక్ స్కూటర్ లాంచ్




టీవీఎస్ మోటార్ కంపెనీ తన లేటెస్ట్ ఎలక్ట్రిక్ స్కూటర్ టీవీఎస్ ఆర్బిటర్ ను లాంచ్ చేసింది. సెగ్మెంట్-ఫస్ట్ ఫీచర్లతో దీన్ని మార్కెట్‌లోకి విడుదల చేసింది. దీని ధర రూ .99,900 (ఎక్స్-షోరూమ్, పీఎం ఈ-డ్రైవ్ స్కీమ్, బెంగళూరు, న్యూఢిల్లీతో సహా). దీన్ని ఒక్కసారి ఛార్జ్ చేస్తే 158 కిలోమీటర్ల ఐడీసీ రేంజ్‌ను అందిస్తుంది. ఆర్బిటర్ 3.1 కిలోవాట్ల బ్యాటరీతో పనిచేస్తుంది. ఇందులో 14 అంగుళాల ఫ్రంట్ వీల్, క్రూయిజ్ కంట్రోల్, హిల్ హోల్డ్ అసిస్ట్, రీజెనరేటివ్ బ్రేకింగ్, రెండు హెల్మెట్లు పట్టేంత 34 లీటర్ల పెద్ద బూట్ స్పేస్ ఇందులో ఉన్నాయి.
కనెక్టెడ్ యాప్, టర్న్ బై టర్న్ నావిగేషన్, జియో ఫెన్సింగ్, టైమ్ ఫెన్సింగ్, క్రాష్/ఫాల్ అలర్ట్స్ , యాంటీ థెఫ్ట్ నోటిఫికేషన్లు, ఓటీఏ (ఓవర్ ది ఎయిర్) సాఫ్ట్‌వేర్ అప్డేట్స్ ద్వారా స్మార్ట్‌ఫోన్ ఇంటిగ్రేషన్‌ను ఈ స్కూటర్ అందిస్తోంది. కలర్ ఎల్‌సీడీ క్లస్టర్ కాల్స్, మెసేజ్ లు, పర్సనలైజ్డ్ అలర్ట్ లను ప్రదర్శిస్తుంది.
పొడవైన 845 ఎంఎం ఫ్లాట్ ఫార్మ్ సీట్, స్ట్రెయిట్ లైన్ ఫుట్ బోర్డ్, నిటారుగా ఉండే హ్యాండిల్ బార్ తో డిజైన్ చేసిన ఈ ఆర్బిటర్ రైడర్ కంఫర్ట్, ఎర్గోనామిక్స్ కు ప్రాధాన్యమిస్తుంది. ఎల్ఈడీ లైటింగ్, ఎమర్జెన్సీ నోటిఫికేషన్స్, లైవ్ ట్రాకింగ్, టోయింగ్ అలర్ట్స్ , 169 ఎంఎం గ్రౌండ్ క్లియరెన్స్ వంటి ఫీచర్లు ఈ ఎలక్ట్రిక్ స్కూటర్లో ఉన్నాయి.
ఆర్బిటర్ నియాన్ సన్బర్స్ట్, స్ట్రాటోస్ బ్లూ, లూనార్ గ్రే, స్టెల్లార్ సిల్వర్, కాస్మిక్ టైటానియం, మార్స్ కాపర్ అనే ఆరు కలర్ ఆప్షన్లలో లభిస్తుంది.

# మట్టి వినాయకుల పూజతోనే ప్రకృతికి దీవెనలు

**-- జిల్లా ఎస్పీ రావుల గిరిధర్**

**వనపర్తి,ఆగస్టు27(తెలంగాణ ముచ్చట్లు):**

మట్టి వినాయకుల పూజతోనే పకృతి దీవెనలు లభిస్తాయని, పర్యావరణాన్ని కాపాడాలంటే ప్రతి ఒక్కరూ మట్టి గణపతులనే పూజించాలి అని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ పేర్కొన్నారు.
వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో, జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో మట్టి వినాయకుల విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ స్వయంగా పాల్గొని ప్రజలకు, పోలీసు సిబ్బందికి విగ్రహాలను అందజేశారు.

**ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ –**

"పండుగలు ప్రజలు ఆనందంగా, కుటుంబ సమేతంగా జరుపుకోవడానికి ఉన్నవే. ఎవరికీ ఇబ్బందులు కలగకుండా, పర్యావరణానికి హాని కలిగించకుండా జరుపుకోవడం మనందరి బాధ్యత. రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలు కాకుండా మట్టి వినాయకులను మాత్రమే పూజించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడగలుగుతాము. లేకపోతే రానున్న తరాలకు కూడా సమస్యలు తలెత్తుతాయి" అని తెలిపారు.
ఈ కార్యక్రమంలో వనపర్తి సీఐ కృష్ణయ్య, స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేష్, రిజర్వేషన్ ఇన్స్పెక్టర్లు అప్పలనాయుడు, శ్రీనివాస్, వనపర్తి పట్టణ ఎస్సై హరిప్రసాద్, డిసిఆర్బి ఎస్సైలు తిరుపతిరెడ్డి, బాలయ్య, రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్ వినోద్, ట్రాఫిక్ రిజర్వ్ ఇన్స్పెక్టర్ సురేందర్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.






# దివ్యాంగుల సమస్యలపై వనపర్తిలో బీజేపీ ధర్నా

**వనపర్తి,ఆగస్టు 27 (తెలంగాణ ముచ్చట్లు):**

దివ్యాంగులకు, వృద్ధాప్యులకి, వికలాంగులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడాన్ని తీవ్రంగా నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో వనపర్తిలో ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఎం. శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో, దివ్యాంగుల పెన్షన్ల పెంపు సహా అన్ని సమస్యల పరిష్కారానికి బీజేపీ తరపున మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా బీజేపీ కార్యకర్తలు బీజేపీ కార్యాలయం నుండి ఆర్డీవో కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించి, అనంతరం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీమా ప్రభాకర్ శెట్టి, జిల్లా అధ్యక్షుడు ఎం. శ్రీనివాసులు, జిల్లాస్థాయి నాయకులు పాల్గొన్నారు. వీరికి మద్దతుగా ఎంఆర్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నకేశవులు, కోఆర్డినేటర్ ఘటన వారి బృందం కూడా పాల్గొన్నారు.

# వినాయక పూజలో పాల్గొన్న మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి దంపతులు

**వనపర్తి,ఆగస్టు27 (తెలంగాణ ముచ్చట్లు):**

వినాయక చవితి పండుగ సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి - వాసంతి నిరంజన్ రెడ్డి దంపతులు తమ స్వగృహంలో వినాయక స్వామిని ప్రతిష్టించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.
ఈ సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ -
"విజయ గణపతి సకల విఘ్నాలు తొలగించి విజయాలు కలిగించాలని, తెలంగాణ ప్రజలు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తున్నాను. వినాయక చవితి పండుగ శుభాకాంక్షలు ప్రజలకు, నాయకులకు, కార్యకర్తలకు, స్నేహితులకు, శ్రేయోభిలాషులకు తెలియజేస్తున్నాను" అని తెలిపారు.





# మృతుడికి నివాళులు అర్పించిన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

**వనపర్తి,ఆగస్టు 27 (తెలంగాణ ముచ్చట్లు):**

పానగల్ మండలం, అన్నారం తండాకు చెందిన రాత్లావత్ స్వామి నాయక్ కుమారుడు రాత్లావత్ శివ గుండెపోటుతో మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి బుధవారం వారి నివాసానికి వెళ్లి భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తరువాత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.
ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరసాగర్, నాయకులు శేఖర్ నాయక్, చందు నాయక్, రాజేశ్వర్ రెడ్డి, సుధాకర్ యాదవ్, స్వామి నాయక్, జానకిరామ్ నాయక్, శివ నాయక్, మోహన్ నాయక్, భాస్కర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in